www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
శనివారం 19, జూలై, 2025 | పేజీలు :12





# హైదరాబాద్‌లో జడివాన

**టీపీఎన్,హైదరాబాద్:**

భాగ్యనగరాన్ని శుక్రవారం ఒక్కసారిగా ముంచెత్తిన వర్షం అతలాకుతలం చేసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి నగరం మొత్తం నీట మునిగిపోయింది. పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. రహదారులన్నీ నదుల్లా మారిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా సికింద్రాబాద్ ప్రాంతంలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. గాలి దుమారాలతో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్కూలు వేళ వర్షం మొదలవ్వడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ సమీపంలో వరద నీరు మోకాళ్లకు పైగా చేరడంతో చిన్నారులు తడిసిముద్దయ్యారు. బోయిన్పల్లి ప్రాంతంలోని సాయిబాబా కాలనీ, సీతారాంపురం, హర్షవర్ధన్ కాలనీ, రామ్‌రెడ్డి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో కూడా రెండు నుంచి మూడు అడుగుల వరకూ నీరు చేరింది. కాలనీలన్నీ తాత్కాలిక చెరువులుగా మారిపోయాయి. పాదచారులు భయంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఐటీ కారిడార్ పూర్తిగా నత్తనడకలో సాగింది. కొండాపూర్, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, ఐకియా, మాదాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో వర్షానికి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు గంటలపాటు ఆ ప్రాంతాలు పూర్తిగా వాహనాలతో జాం అయ్యాయి. వర్షపు నీరు రోడ్లపైకి ప్రవహించడంతో ట్రాఫిక్ నియంత్రణ అసాధ్యమైంది. మరోవైపు హైదరాబాద్‌కు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి వేళలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్వయంగా రంగంలోకి దిగి సహాయక చర్యలను పర్యవేక్షించారు. హైడ్రా, DRF సిబ్బంది, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతో కలిసి బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. మాసాబ్‌ట్యాంక్, హైటెక్ సిటీ, అయ్యప్ప సొసైటీ, గాజులరామారం, కూకట్‌పల్లి, హోఫీజ్‌పేట వంటి ప్రాంతాల్లో భారీగా వరద నీరు నిలిచినట్టు కంట్రోల్ రూం సమాచారం అందించింది.

వర్షానికి పరవళ్లు తొక్కిన ప్యాట్నీ నాలా మరోసారి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే తమ కాలనీలు మునిగిపోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ పనులను ఓ ఇంటి యజమాని అడ్డుకోవడంతో విస్తరణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పలు ఇళ్లలో నీట మునిగి చిక్కుకుపోయిన వాసులను DRF సిబ్బంది బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంబర్‌పేట బతుకమ్మ కుంటలోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది.

**అధికారులను అలర్ట్ చేసిన సీఎం**

వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

**#అప్రమత్తంగా ఉండాలని మేయర్ విజ్ఞప్తి**

టీపీఎన్, హైదరాబాద్: వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. అత్యవసర అవసరాల కోసం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (GHMC) హెల్ప్‌లైన్ 04021111111, హైడ్రా బృందాల నంబర్ 90001 13667ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన మేయర్, మాన్సూన్ ఎమర్జెన్సీ, హైడ్రా బృందాలు ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని ఆదేశించారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని, లేకుంటే ఇంటికే పరిమితమవ్వాలని నగరవాసులకు సూచించారు. పిల్లలు నాలాల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. మాన్‌హోల్‌స్‌ను ఓపెన్ చేయవద్దని స్పష్టం చేశారు. మేయర్ విజ్ఞప్తి చేశారు. మిగతా 4లో..

**అధికారులకు డిప్యూటీ మేయర్ సూచనలు**

జీహెచ్ఎంసి అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. ఎమర్జెన్సీ మాన్సూన్ టీమ్‌లు 24 గంటలపాటు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. నియమిత బృందాలు ప్రతి ప్రాంతంలో సకాలంలో స్పందించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మ్యాన్‌హోల్స్, నీటిలో మునిగే ప్రాంతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, నీటి ప్రవాహ ప్రాంతాలకు దూరంగా ఉండాలని మోతే శ్రీలత ప్రజలకు సూచించారు.

# మల్నాడు కేసుపై ఈగల్ టీమ్ దూకుడు

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**

రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ పార్టీ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. విచారణను వేగవంతం చేసిన ఈగల్ టీం... ఇప్పటికే మూడు ప్రముఖ పబ్‌ల యజమానులపై కేసులు నమోదు చేసింది. డ్రగ్స్ పార్టీలు నిర్వహించేందుకు పబ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తేలింది. మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్యతో పబ్ యజమానులకు బలమైన సంబంధాలున్నాయని ఈగల్ టీం గుర్తించింది. వీరంతా కలిసి అనేక సార్లు డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా తేలడంతో చుట్టూ ముప్పు కమ్ముకుంది. వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, క్వాక్ పబ్‌ల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. క్వాక్ పబ్‌కి చెందిన రాజాశేఖర్, కోరా పబ్ యజమాని పృథ్వీ వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ ముగ్గురూ





డ్రగ్ పార్టీల్లో భాగస్వాములుగా వ్యవహరించినట్లు మల్నాడు రెస్టారెంట్ సూర్య వెల్లడించినట్లు సమాచారం. తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఈ ముగ్గురు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఇంతలో మరో నాలుగు పబ్ యజమానుల ప్రమేయంపై ఈగల్ టీం దృష్టిసారించింది. ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్, బ్లాక్ 22 వంటి పబ్బుల్లో డ్రగ్స్ పార్టీలు జరిగినట్లు సమాచారం. విచారణలో ఈ వివరాలన్నీ వెలుగులోకి వచ్చాయని సమాచారం. డీజే నైట్లు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు వీలు కల్పించినట్లుగా అధికారులు భావిస్తున్నారు. కేవలం పబ్ యజమానులు మాత్రమే కాదు, అధికార కుటుంబాలకు చెందినవారిపైనా అనుమానాలు కేంద్రీకృతమవుతున్నాయి. మల్నాడు డ్రగ్స్ కేసులో అదనపు ఎస్పీ వేణుగోపాల్ రావ్ కుమారుడు రాహుల్ తేజ్ పేరు కూడా ఈగల్ టీం విచారణలో బయటపడింది. ములుగు జిల్లా కన్వేరా వద్ద రాహుల్ తేజ్‌కు ఫార్మ్ హౌస్ ఉండగా, అదే ప్రాంతంలో డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతి వారం సూర్యతో పాటు డ్రగ్ పెడ్లర్లు రాహుల్ తేజ్ ఫార్మ్ హౌస్‌లో కలుస్తున్నారని విచారణలో తేలిందని ఈగల్ టీం చెబుతోంది. మొత్తంగా చూస్తే మల్నాడు డ్రగ్స్ కేసు ఒక్క రెస్టారెంట్ దాకా పరిమితం కాకుండా పబ్‌లు, ఫార్మ్ హౌస్‌లు, అధికార కుటుంబాల దాకా వ్యాపించినట్లు స్పష్టమవుతోంది. ఈ కేసులో ఇంకెన్ని పేర్లు బయటపడతాయో, ఎవరెవరికి నిద్రలేని రాత్రులు వస్తాయో వేచి చూడాలి.

# దమ్ముంటే లై డిటెక్టర్ టెస్ట్ పెట్టండి

**టీపీఎన్, ఖమ్మం:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో జరిగిన రహస్య ఒప్పందం బయటపడటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. మోసాలను దాచిపెట్టేందుకే ఇప్పుడు 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. "రైతులకు ఎరువులు దొరకడం లేదు. వ్యవసాయానికి కరువు. అయినా ప్రభుత్వం మౌనంగా ఉంది. 18 నెలల కాలంలో రాష్ట్రానికి ఏం చేసింది? ఖమ్మం జిల్లాకు ఏం చేసింది?" అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును రేవంత్ కట్ రిబ్బన్ కట్టడమే తప్ప, కొత్తగా ప్రారంభించిందేమీ లేదని సెటైర్లు వేశారు...... **2వ పేజీలో..**





## గుండెల్లో రాసుకో కేసీఆర్ పదేళ్లు నేనే సీఎం..!

టీపీఎన్, కొల్లాపూర్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ప్రత్యేక రాష్ట్రం రాక ముందు కంటే కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే ఎక్కువ అన్యాయం జరిగిందని విమర్శించారు. పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతానికి ద్రోహం చేశారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇస్తామని జీవో ఇచ్చారు. కానీ దాని అమలుకు నోచుకోలేదన్నారు. వాల్మీకి, బోయ వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని చెప్పారు. కానీ ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అలంపూర్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో ఉన్న ఈ వర్గాలవారికి న్యాయం జరగలేదు,'' అని చెప్పారు.''కరీంనగర్ నుంచి వచ్చిన కేసీఆర్‌కు, పాలమూరు గడ్డే అండగా నిలిచింది. అదే ఆయనకు సీఎం అయ్యే మార్గం అయింది. కానీ పదేళ్ల పాలనలో పాలమూరును పక్కన పెట్టారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశాలు పొందుతుంటే ఆయనకు ఎందుకు బాధ వేస్తోంది? పాలమూరు బిడ్డ సీఎంగా ఉండాలని ప్రజలు ఆకాంక్షించడం మీకు ఇష్టం లేకపోవడమేనా? మా పిల్లలు చిన్న పనులు చేయాలి... మీ పిల్లలు అధికారం దక్కించుకోవాలా? పాలమూరు అభివృద్ధి చెందుతుంటే మీకు అసహనం ఎందుకు? ఈ జిల్లా అంటే చిన్నచూపు' ఎందుకు అని ఫైర్ అయ్యారు. ''పదేళ్లలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికాలేదు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, జూరాల ప్రాజెక్టులు ముందుకెళ్లలేదు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టుకి మాత్రం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఆ ప్రాజెక్టు కేవలం నాలుగేళ్లకే కూలిపోయింది. గుడిసె వేసుకున్నవాడు అయినా పదేళ్లు ఉండేలా కట్టుకుంటాడు. కాళేశ్వరం మాత్రం నిలబడలేదు. పాలమూరు మీద ప్రేమ ఉంటే ఇలా జరగేదా? పాలమూరు బిడ్డ 2034 వరకూ సీఎంగా ఉంటుంది. ఇది వాస్తవం. కేసీఆర్ గారు, దీన్ని గుండెల మీద రాసుకోండి. మేము పాలమూరు నుంచే ప్రజా ప్రభుత్వాన్ని నడిపిస్తాం,'' అని స్పష్టం చేశారు.''పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడం నా బాధ్యత. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు అందిస్తాను. భూసేకరణకు ఎంత ఖర్చైనా వెనకడుగు వేయను. ఈ ఏడాది డిసెంబర్ 9లోపు నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తాం. రానున్న రెండేళ్లలో ప్రాజెక్టులు పూర్తయ్యేలా చేస్తాం. మేము మాట ఇచ్చే ప్రభుత్వం కాదు... మాట నిలబెట్టే ప్రభుత్వం,'' అని హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. ''మీరు కల్వకుర్తి ప్రాజెక్టు మొదలు పెట్టారు. మీరు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు మొదలైంది. ఇప్పుడు అదే ప్రాజెక్టులను అడ్డుకోవడం సరైన పని కాదు. మీరు పాలమూరును దత్తత తీసుకున్నారు. ఇప్పుడు బాధ్యతగా వ్యవహరించండి. మమ్మల్ని బతకనివ్వండి. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయండి'' అని కోరారు.''పాలమూరుకు న్యాయం జరగాలి. గత పాలకులు దీన్ని విస్మరించారు. కానీ ఇప్పుడు మేము దీన్ని నిలబెడతాం. పేరు పోగొట్టిన పాలనను వారు చూపిస్తే... పేరును నిలబెట్టే పాలనను మేము చూపిస్తాం,'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.



## కేసీఆర్‌పై తిరుగుబాటా?
## బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా?

- *** బీఆర్ఎస్‌లో క్లైమాక్స్‌కు ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్**
- *** బీసీ రిజర్వేషన్లపై పార్టీ వైఖరిని తప్పుపట్టిన కవిత**
- *** పార్టీ వైఖరిని కాదని.. బీసీ రిజర్వేషన్లను సమర్థించిన కవిత**
- *** బీఆర్ఎస్ నా దారికి రావాల్సిందేనని ప్రకటన**
- *** కేసీఆర్, బీఆర్ఎస్ చేస్తుందోనని కేడర్‌లో ఆసక్తి**

**టీపీఎన్. తెలంగాణ:**

భారత రాష్ట్రసమితిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ క్లైమాక్స్‌కు చేరినట్టేనా? ఇన్నాళ్లూ కొందరు నాయకులను మాత్రమే తప్పుపడుతూ వచ్చిన కవిత.. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ రిజర్వేషన్లపై పార్టీ వైఖరిని తప్పుపట్టడం దేనికి సంకేతం? ఇక కేసీఆర్‌తో తాడోపేడో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారా? తన దారికే బీఆర్ఎస్ రావాల్సిందేనని ప్రకటించడం దేనికి సంకేతం? ఇంత జరుగుతున్నా కేసీఆర్ నిర్ణయం ఏంటి? పార్టీ నుంచి కవిత వెళ్ళిపోయేలా చేస్తారా? లేక వేటు వేస్తారా? ఇవీ ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మనసులో మెదులుతున్న ప్రశ్నలు. మరికొద్దిరోజుల్లోనే కవిత ఎపిసోడ్‌కు సమాధానం లభించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ........**3వ పేజీలో..**

## బీసీ రిజర్వేషన్లు..
## కాంగ్రెస్ వ్యూహానికి బూస్టప్‌గా మారుతాయా?

- **42% రిజర్వేషన్ వెనుక రాజకీయ లెక్కలేమిటి?**
- **బీసీలకు బంపర్ ఆఫర్.. కానీ ఓట్లు గ్యారంటీనా?**
- **బీసీ కార్డు వేసిన కాంగ్రెస్.. ఎన్నికల్లో రాణించగలదా?**

**టీపీఎన్, తెలంగాణ:**

బీసీల ఓటు బ్యాంకుపై పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కీలకంగా అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన దిశగా తీసుకున్న తాజా నిర్ణయం, రాబోయే ఎన్నికల ముందు రాజకీయంగా బలమైన వ్యూహంగా మారబోతోందని భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే జీవో విడుదల చేసి అధికారికంగా అమలుకు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది..... **మిగతా 3వ పేజీలో..**



## అటవీ భూముల బదలాయింపులో
# వేగం పెంచాలి

**టీపీఎన్, తెలంగాణ:** రోడ్ల నిర్మాణాలకు అటవీ భూముల బదలాయింపును త్వరిత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. బాచుపల్లి గండిమైసమ్మ వరకు ఆరు వరుసల రహదారి, బహుదూర్‌పల్లి నుంచి దూలపల్లి మీదుగా కొంపల్లి వరకు రహదారి నిర్మాణాలకు సంబంధించి అటవీ భూముల బదలాయింపు అంశంపై మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ సువర్ణ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ నవాజ్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ అదనపు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవసరమైన అటవీ భూములు, ఫారెస్టేతర స్థలాల భూసేకరణ పనులను శీఘ్రంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ మొదటి వారంలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగేలా యుద్ధ ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు పూర్తవ్వాలన్నారు. అటవీశాఖకు చెందిన 19 ఎకరాల భూమి అప్పగింతకు సంబంధించిన మొదటి దశ ఫార్మాలిటీలను గడువులోగా ముగించాలని అధికారులను ఆదేశించారు.

స్థానికుల భూముల సేకరణ, నష్టపరిహార చెల్లింపుల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని శ్రీధర్‌బాబు వివరించారు. బహుదూర్‌పల్లి-కొంపల్లి రహదారి కోసం అవసరమైన అటవీ భూముల బదలాయింపులో స్టేజ్ 1 ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని అధికారులు మంత్రికి తెలియజేశారు. బాచుపల్లి-గండిమైసమ్మ రహదారి నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల ట్రాన్స్‌ఫర్ కూడా త్వరలో పూర్తవుతుందని వివరించారు. అలాగే సుభాష్‌నగర్ పైప్‌లైన్, సెయింట్ యాన్స్ స్కూల్ రోడ్డుల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు మంత్రి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.



# బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:** జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీని గ్రామాల్లోకి విస్తరించేందుకు పార్టీ శ్రేణులు చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 1980లో బీజేపీ ఆవిర్భావ సమయంలో మెదక్ యువమోర్చా ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించిన అనుభవాన్ని గుర్తు చేస్తూ, సైకిళ్లపై తిరుగుతూ బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించిన రోజులను ఆయన గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులతో పోలిస్తే బీజేపీ ఇప్పుడు పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ బలంగా విస్తరించిందని చెప్పారు.సభ్యత్వ నమోదులో తెలంగాణ మొత్తం నుంచి 40 లక్షల మంది పార్టీలో చేరితే, మెదక్ జిల్లాలోనే 8 లక్షల మంది చేరినట్టు వెల్లడించారు. మెదక్ నుంచి రఘునందన్ రావు ఎంపీగా గెలవడం, ఆలే నరేంద్ర ఎంపీగా గెలిచిన ఘట్టాన్ని ప్రస్తావిస్తూ జిల్లాలో బీజేపీకి బలమైన పునాది ఉందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు ఇప్పటి వరకు రూ.12 లక్షల కోట్లకు పైగా నిధులు అందాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇస్తోందే తప్ప ఒక్కటైనా నెరవేర్చలేదని విమర్శించారు. రైతుబంధు నిలిపివేయడం, రుణమాఫీ చేయకపోవడం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం ప్రజలతో మోసం చేస్తున్న దృష్టాంతాలేనన్నారు.పాలన పక్కనపెట్టి ఢిల్లీ యాత్రలకే పరిమితమవుతున్న సీఎం, మంత్రుల తీరును ఆయన ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లాలో సాగునీరు సింగూరు ద్వారా అందకపోవడం, మల్లన్నసాగర్ భూస్వాధీనం చేసిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని చూపుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ అభివృద్ధి జరగలేదని, ఇక్కడి నేతలు మంత్రులుగా ఉన్నప్పటికీ జిల్లా వెనుకబాటే మిగిలిందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీను మంజూరు చేయడం, నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్న విషయాలను ప్రస్తావించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా ప్రాజెక్టును పర్యవేక్షిస్తారని చెప్పారు.బీజేపీ బీసీల పార్టీ అని, ప్రధాని మోదీ బీసీ వర్గానికి చెందినవారేనని, కేంద్ర మంత్రివర్గంలో 20 మందికిపైగా బీసీలు ఉన్నారని చెప్పారు. బీసీలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసి ఓ బీసీ నేతకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ హామీని నెరవేర్చకుండా అందులో 10 శాతం ముస్లింలను కలపాలన్న కుట్ర చేస్తోందని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ తేలికపాటి వ్యతిరేకత కాదని, బలమైన వైఖరి ఉందన్నారు.యూపీఏ పాలనలో అవినీతి రాజ్యమేలిందని, మోదీ పాలనలో అవినీతిరహిత పాలన, సుపరిపాలన కొనసాగుతోందని తెలిపారు. గరీబ్ కళ్యాణ్ యోజన కింద దేశవ్యాప్తంగా పేదలకు ఉచిత రేషన్ అందుతోందని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు ఉన్న 50 సీట్లలో 35 ముస్లింలకు కేటాయించడమే బీఆర్ఎస్ పాలన బీసీల పట్ల ఎలా అన్యాయంగా వ్యవహరించిందనే దానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకుల రాజకీయాల కోసం బీసీలను మతపరమైన రిజర్వేషన్లతో మోసం చేస్తున్నాయని ఆరోపించారు.తాను న్యాయవాదిగా అనేక సేవలందించానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం పూర్తి సమన్వయంతో పని చేస్తానని ప్రకటించారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చిన ప్రజలు.... ఇప్పుడు ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని కోరారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి, మెదక్‌లో మరో భారీ సభ నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

# దమ్ముంటే లై డిటెక్టర్ టెస్ట్ పెట్టండి



**టీపీఎన్, ఖమ్మం:** ఢిల్లీలో రేవంత్ చిట్‌చేసిన ఆరోపణలపై ఘాటుగా స్పందించిన కేటీఆర్.... "దమ్ముంటే లై డిటెక్టర్ టెస్ట్ పెట్టండి. ఎక్కడైనా వస్తాను. లోకేష్‌ను అర్ధ రాత్రి కలవాల్సిన అవసరం నాకు లేదు. కలవాలంటే పగలే కలుస్తాం. రహస్యంగా కలవడం ఎందుకు? అసలు కలవలేదు కూడా. అయినా కలిస్తే తప్పేంటి?" అని సమర్థించుకున్నారు.రేవంత్‌ను అసెంబ్లీలో చర్చకు ఆహ్వానించామనీ, "మా మైక్ కట్ చేయకుండా ఉంటే చర్చించేందుకు సిద్ధం" అని చెప్పారు. "రేవంత్ సవాల్ విసిరాడు కానీ, చివరకు తోక ముడిచాడు. అసలు ఆయన మాటల్లో స్థిరత్వం లేదు. ఓసారి బనకచర్లపై చర్చించామంటారు, ఇంకోసారి ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చించలేదంటారు" అని కేటీఆర్ విమర్శించారు."తెలంగాణను కేసీఆర్ ఎన్నో రంగాల్లో నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దారు. కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వంలోకి వచ్చాక ప్రజలకు ప్రయోజనం కలిగించలేకపోయింది. కేవలం ఆరోపణలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. హామీల సంగతేంటి? డ్రగ్స్, హెరాయిన్ అంటూ ఆధారాలు లేకుండా ఎవరిమీదైనా ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరన్నారు. దుబాయ్‌లో ఎవరో చనిపోతే అది నాకు సంబంధం లేకుండా ఎలా బురదజల్లుతారు?" అని ప్రశ్నించారు. "రేవంత్‌కు ఎప్పటికీ కేసీఆర్ స్థాయి రాదు. తేడా తెలుసుకుని వ్యవహరించాలి." అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో బ్రహ్మాండమైన మెజారిటీతో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.




# కేసీఆర్ భయంతో అసెంబ్లీకి రావడం లేదు

**టీపీఎన్, తెలంగాణ:** కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీలోకి రావడం లేదని.. ప్రజల సమస్యలపై మాట్లాడేందుకు కేసీఆర్ సిద్ధంగా లేరని ఆరోపించారు. కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర నిధుల కోసం పోరాడే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. పదేళ్ల పాలనలో సచివాలయం రాలేదని, ప్రజల మధ్య తిరగలేదన్నారు. అందుకే తెలంగాణ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని విశ్వసించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ భవితవ్యం పూర్తిగా కేసీఆర్ మీదే ఆధారపడి ఉందన్నారు. ఆయన లేకపోతే ఆ పార్టీకి నావే లేదన్నారు. "కేసీఆర్ ఉన్నంతవరకే కేటీఆర్, హరీష్‌రావులకు ఉనికి ఉంది. ఆయన వెళ్లిపోయిన వెంటనే వాళ్ల బంగారు రోజులూ ముగుస్తాయి" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాలన ప్రజలకు కాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైందని సెటైర్లు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తోందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకే కేసీఆర్ అసెంబ్లీకి రారని అన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజల పాలన అయితే, కేసీఆర్ పాలన ఫామ్‌హౌస్‌కు పరిమితమైపోయిందని ఎద్దేవా చేశారు. "మేము ప్రజలు పెట్టిన బాధ్యతలు తీర్చే పనిలో ఉన్నాం. సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లేది తెలంగాణ వాటా నిధులు తెచ్చేందుకే. కానీ బీఆర్ఎస్ నేతలు దాన్ని రాజకీయంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు" అని మండిపడ్డారు. "రేవంత్ తెలంగాణ అనడం లేదంటూ విమర్శలు చేస్తున్న వారు.. ఒకప్పుడు ఆయన్నే పార్టీ నుంచి తిట్టి బయటకు నెట్టేశారు. ఇప్పుడు ఆయనే సీఎం కావడంతో కడుపు మండిపోతోందేమో!" అని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీష్‌రావు రేవంత్ చంద్రబాబు శిష్యుడని చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. "మీ నాన్నే చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా చేసాడు.. ఈ సంగతిని మరచిపోకండి," అని ఫైర్ అయ్యారు. కేసీఆర్ టీడీపీ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.

**బీజేపీ డైరెక్షన్‌లో జగన్, లోకేష్‌తో రహస్య భేటీలు**

లోకేష్‌ను ఎందుకు కలిశావో సమాధానం చెప్పాలని కేటీఆర్ ను ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కేటీఆర్ ఓ ఫార్మ్‌హౌస్‌లో లోకేష్, జగన్‌మోహన్‌రెడ్డిని వేర్వేరు సమయాల్లో రహస్యంగా కలిశారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ సమావేశాలు బీజేపీ స్క్రిప్ట్ ప్రకారమే జరిగాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "సాటుకు సంసారం చేసేది మీరు.. బురద జల్లేది మాపైనా?" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తన ద్వంద్వ పాత్రలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.



# నాగార్జునసాగర్ నుంచి భట్టి పవర్ పంచ్

**టీపీఎన్, నాగార్జునసాగర్:** సీఎం స్థాయి వ్యక్తిని "హౌలే, సన్నాసి" అని అభ్యంతరకర పదాలతో బీఆర్ఎస్ నేతలు విమర్శించడం ఏ భాష? ఏ సంస్కృతి? అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. "మన భాషనే ప్రజలు నేర్చుకుంటారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలకు నేర్పేది ఇదేనా?" అని ప్రశ్నించారు.రివర్స్ పంపుడు టెక్నాలజీని గొప్పగా చెప్పుకుంటున్న గులాబీ పార్టీ నేతలకు 1978లోనే నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే దానికి శ్రీకారం చుట్టిందని భట్టి వివరించారు. హైడెల్ విద్యుత్ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా శుక్రవారం నాగార్జునసాగర్‌కు వచ్చిన భట్టి, అక్కడి విద్యుత్ ఉత్పత్తి పనులను సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినా, ఒక్కచోటా అంతరాయం లేకుండా నాణ్యమైన సరఫరా చేసిన విద్యుత్ శాఖ సిబ్బందిని అభినందించారు. కొత్త పరిశ్రమలు, అభివృద్ధి కార్యక్రమాల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. ఇది రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతోందని తెలిపారు. విపక్షం వ్యవహార శైలి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన భట్టి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై, లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేని కారు పార్టీ నేతలు ఇప్పటికీ మారలేదన్నారు. పదేళ్ల పాలన పోయిందనే బాధతో మాట్లాడుతున్న భాషను చూసి సమాజమే తలదించుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ప్రస్తుతం గత ప్రభుత్వ పాలనలో జరిగిన నీటి పొరపాట్లను సరిదిద్దే పనిలో ఉన్నారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల్లో వాటాలు తేల్చడంలో కేసీఆర్ ప్రభుత్వం మొద్దునిద్రలో మునిగిపోయిందని ఆరోపించారు. ప్రాజెక్టులు పూర్తిచేయలేకపోవడం వల్లే నేడు నీటి సమస్య తలెత్తిందని చెప్పారు.2030 నాటికి 25 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని కేంద్ర విద్యుత్ సంస్థలు అంచనా వేసాయని, రాష్ట్ర ప్రభుత్వం 2029-30 నాటికి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కాలుష్య రహిత విద్యుత్ సరఫరాకు ఇది కీలకంగా మారుతుందని చెప్పారు. కృష్ణా నదిపై జూరాల నుంచి పులిచింతల వరకూ, గోదావరి నదిపై ఎస్ఆర్ఎస్పీ నుంచి ఇందిరా సాగర్ వరకు ఉన్న ప్రాజెక్టుల్లో రివర్స్ పంపింగ్ ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై అధ్యయనం చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్ స్థాయి నుంచి సీఎండీ స్థాయి వరకు శిక్షణా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయలేని పరిస్థితుల్లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌పై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు.విద్యారంగంలో సమాన అవకాశాల కోసం 25 ఎకరాల్లో రూ. 200 కోట్లతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామన్నారు. 104 పాఠశాలలు ఒకేసారి నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# కేంద్రం అడుగేస్తే.. రాష్ట్రం బ్రేక్ వేస్తోంది



**టీపీఎన్, తెలంగాణ:** కేంద్రం రైల్వే రంగంలో సహకరిస్తున్న పెట్టుబడులపై రాష్ట్రం సరైన ఉపయోగం చేసుకోలేకపోతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టుల విలువను తక్కువ చేస్తూ ప్రజలను దారి తప్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. ముఖ్యంగా కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌ను 'వ్యాగన్ క్లీనింగ్ యూనిట్' అంటూ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం ఎగతాళి చేయడం అభివృద్ధిని అణచివేయాలనే కుట్రలో భాగమన్నారు. కాజీపేట యూనిట్ నిర్మాణంలో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కోచ్‌లు, ఇంజిన్లు, వ్యాగన్ల తయారీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటివరకు రూ. 521 కోట్లు ఖర్చు చేసి, అదనంగా రూ. 200 కోట్లు విడుదలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టును ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించనున్నారని వెల్లడించారు.

తెలంగాణపై కేంద్రం చూపుతున్న శ్రద్ధను గుర్తించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రతిపాదనలకు అడ్డు చెప్పిందని ఆరోపించారు. వరంగల్‌లో విమానాశ్రయం కోసం పదేపదే భూమిని కోరినా అప్పటి ప్రభుత్వం సహకరించలేదని ఆరోపించారు. ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే వరంగల్ రింగ్ రోడ్ పనులు 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటిఎస్ ఫేజ్ 2 ప్రాజెక్టు కోసం రూ.330 కోట్లతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిలిపివేసిందని విమర్శించారు. కోమురవెల్లి మల్లన్న ఆలయానికి రైల్వే స్టేషన్‌ను 2026 జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. తెలంగాణలో మొత్తం 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు కేంద్రం రూ.33,000 కోట్లు వెచ్చిస్తోందని, జూన్ 2026 నాటికి అన్ని పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

గోదావరి జలాల విషయంలో బీఆర్ఎస్ అస్థిరమైన వైఖరిని అవలంబిస్తోందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సీఎంల మధ్య చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అభివృద్ధికి బ్రేకులు వేస్తే ప్రజలే ప్రశ్నిస్తారని తగిన సమాధానం చెబుతారని కిషన్‌రెడ్డి వివరించారు.

# "హరీష్‌రావు ఎదుట మీ నాయకులు నిలవలేరు"



**టీపీఎన్, తెలంగాణ:** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మెదక్ జిల్లా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి విమర్శించారు. కేవలం వార్తల్లో ఉండేందుకే అబద్ధాలు చెప్పడాన్నే మహేష్ గౌడ్ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. మైనంపల్లి హనుమంతరావు ఉడత ఊపులకు భయపడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ఇంచార్జి మంత్రి వివేక్ జిల్లా కోసం ఏం చేశారు అనేది స్పష్టంగా చెప్పకుండా.. చవకబారు వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీష్‌రావులపై మహేష్ గౌడ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురాలేకపోతే పీసీసీ చీఫ్ అయే పరిస్థితి ఉండేది కాదని ఎద్దేవ చేశారు. "రేవంత్ మెప్పు కోసమే మహేష్ గౌడ్ తన స్థాయిని మరచి పరుష పదజాలంతో మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలకు సంబంధం లేని అంశాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేక బీఆరఎస్ నాయకత్వంపై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు.కేసీఆర్, హరీష్‌రావుల అనుభవం ముందు మహేష్ గౌడ్ ఏమిటని ప్రశ్నించిన ఆమె.. "రైతులకు యూరియా పంపిణీలో చూపవలసిన శ్రద్ధను విమర్శలకే కేటాయిస్తున్నారని విమర్శించారు. 19 నెలల్లో 2 లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లలో FRBM పరిమితిలో రూ.4.2 లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చిన కేసీఆర్‌ను తప్పుపట్టడం గౌరవప్రదం కాదన్నారు. "ప్రియాంకగాంధీ చేతుల మీదుగా యూత్ డిక్లరేషన్ విడుదల చేసి లక్షల ఉద్యోగాల మాట ఇచ్చి.. ఇప్పటివరకు 11 వేల ఉద్యోగాలకూడా ఇవ్వని ప్రభుత్వం మళ్లీ అదే మాటలు చెప్పడం విడ్డూరం. మేము ఇచ్చిన నోటిఫికేషన్లను కలిపే చెప్పుకుంటూ మోసం చేస్తున్నారు" అని ఆరోపించారు."కేసీఆర్ తీసుకొచ్చిన అప్పులతో తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దారు. ఆయన హయాంలోనే రాష్ట్రం విద్యుత్, సాగు, తాగునీళ్లలో ఆత్మనిర్భరత సాధించింది. ప్రజాదర్బార్ పెట్టి ప్రజలను కలుస్తానన్న రేవంత్ ఇప్పుడు కోతలు పెడుతున్నాడని, దీని గురించి మహేష్ గౌడ్ స్పందించాలని డిమాండ్ చేశారు."స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని ప్రలోభాలొచ్చినా ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేయరు. నదీజలాల్లో హరీష్‌రావు విశ్లేషణను భరించలేకే మహేష్ గౌడ్ దూకుడుగా మాట్లాడుతున్నారు. సాగునీటి రంగంలో మీ నాయకులు చేసే ఎత్తులు, హరీష్‌రావు అనుభవం ముందు నిలబడలేవు. ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చూసినా మీకు నిజాలు అర్థమయ్యే అవకాశం ఉంటుందని పద్మాదేవేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# నిర్లక్ష్యంపై అధికారులకు హెచ్చరిక



**టీపీఎన్, హైదరాబాద్:** రాష్ట్రంలోని 327 బీసీ గురుకుల విద్యాలయాలపై ప్రభుత్వం మరింత పట్టు పెంచింది. ఇటీవల బీసీ గురుకులాల్లో జరిగిన వరుస ఘటనల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా ప్రిన్సిపాల్‌లు, ఆర్సీఓలు, గురుకులాల సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ గురుకులాల్లో ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తారు. నిర్లక్ష్యాన్ని ఏ స్థాయిలోనూ సహించబోమని అధికారులను హెచ్చరించారు. ఆర్సీఓలు నిర్దిష్టంగా ప్రతి గురుకులాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఏవైనా సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీపడొద్దని, ప్రభుత్వం ఇప్పటికే మెస్ చార్జీలను పెంచిందని మంత్రి గుర్తుచేశారు. మెనూ ప్రకారం పిల్లలకు పోషకాహారం అందించాలి. ఎవ్వరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురుకులాల శుభ్రత, పరిశుభ్రత పాటించడం అత్యవసరమని, పిల్లలకు నియమిత వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గురుకులాల్లో జరిగే ప్రతీ ఘటనపై సంబంధిత అధికారులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, శిక్షణపై ప్రభుత్వం రాజీ పడబోదని మంత్రి పొన్నం తెలియజేశారు.

# కేసీఆర్‌పై తిరుగుబాటా? బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా?





**టీపీఎన్, తెలంగణ:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతకంతకూ ముదురుతోంది. నిన్న మొన్నటి వరకు పార్టీలో కోవర్టులున్నారంటూ విమర్శిస్తూ వచ్చిన కవిత.. ఇప్పుడు ఏకంగా పార్టీ వైఖరినే ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వర్తింపజేసే ఆర్డినెన్స్ రేవంత్ ప్రభుత్వం తీసుకురావడంపై కవిత వైఖరి.. బీఆర్ఎస్ వైఖరికి భిన్నంగా ఉంది. మే నెలలో పార్టీ అధ్యక్షుడు, తన తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు లీక్ అవడంతో వివాదం మొదలైంది. కేసీఆర్ దేవుడు కానీ ఆయన చుట్టూ దయ్యాలున్నాయని.. మరో సందర్భంలో పరోక్షంగా కేటీఆర్, హరీష్‌రావులను తప్పుపడుతూ వచ్చారు. అయినా కేసీఆర్ స్పందించలేదు. కవిత వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ ఇప్పుడు ఏకంగా పార్టీ నిర్ణయాన్ని ప్రశ్నించే స్థాయికి చేరింది. అంటే ఇక కేసీఆర్‌పై తిరుగుబాటుకు సిద్ధమైనట్టేనన్న చర్చ మొదలైంది.

**ధిక్కార స్వరం పెంచిన కవిత**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్స్ విషయంలో బీఆర్ఎస్ వైఖరి ఒకలా ఉంటే.. ఎమ్మెల్సీ కవిత మరోలా వ్యవహరిస్తున్నారు. రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తెస్తే చాలదని.. దానికి చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే కవిత మాత్రం ప్రభుత్వాన్ని సమర్థించడమే కాకుండా వేడుకలు కూడా నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు దిష్టిబొమ్మ దహనం చేస్తే.. పనీపాటా లేదు కాబట్టి దిష్టిబొమ్మ దహనం అంటూ పార్టీకే కౌంటర్ ఇచ్చారు కవిత. న్యాయ నిపుణులను సంప్రదించిన తర్వాతే ఆర్డినెన్స్‌కి మద్దతుగా మాట్లాడుతున్నానని కవిత తన వైఖరిని సమర్థించుకున్నారు. ఎప్పుడైనా ఈ విషయంలో బీఆర్ఎస్ నా దారికి రావాల్సిందేనన్నారు.

**పార్టీ వైఖరి ఎలా ఉండబోతోంది?**

తాజా ఎపిసోడ్ తర్వాత కవితకు, బీఆర్ఎస్‌కు దూరం మరింత పెరిగినట్టేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కవిత అయితే సొంతంగా ముందకు వెళ్లాలని నిర్ణయించుకునే.. బీసీ అజెండాను ఎత్తుకుని రాజకీయం చేస్తున్నారు. సాధారణంగా కేసీఆర్ వైఖరిని ప్రశ్నించే ధైర్యం పార్టీలో ఎవరూ చేయరు. ప్రశ్నించిన నాయకులకు ఉనికిలేకుండా చేయడం కేసీఆర్ వైఖరి. కాబట్టి ఇప్పుడు కవితను కూడా అలాగే వదిలేస్తారా? పరిస్థితి చేయిదాటే వరకు ఎదురుచూస్తారా? తనంతట తానుగా బయటకు వెళ్లేలా తెరవెనుక నుంచి ప్రయత్నాలు చేయిస్తారా? అనేది వెయిట్ అండ్ సీ.



# కూరగాయల బుట్టపై రాజకీయాలు చేస్తారా?

**టీపీఎన్, తెలంగాణ:** మంత్రి సీతక్క బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు చేశారు. కూరగాయల బుట్ట కిందపడితే కూడా మైండ్ లేకుండా టీఆర్ఎస్ నేతలు అపచారం జరిగిందని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఘటనను అపచారంగా చిత్రించి జర్నలిస్టుల ముసుగులో ఉన్న కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు వైరల్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అసలు వాళ్లకి మైండ్ ఉందా?" అని ప్రశ్నించారు. ములుగులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీతక్క బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. "నేను దొరసానిని కాదు. మంత్రిని అయినా ప్రజల మధ్యే ఉంటాను. నా చుట్టూ పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారు. అందులో ఒకరు పొరపాటుగా కూరగాయల బుట్టను తగిలించడంతో అవి కిందపడ్డాయి. దాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడం ఏం సంస్కృతి?" అంటూ అసహనం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలకు రూ. 3,000 కోట్ల వడ్డీలు ఎగ్గొట్టిన బీఆర్ఎస్ పార్టీకి, ఇప్పుడు ఇందిరా మహిళా శక్తి సంబరాలు చూస్తుంటే.... కళ్లు మండుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యక్రమాలను చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

**టీపీఎన్, సంగారెడ్డి:** ఇటీవల మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన డాక్టర్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. సంగారెడ్డిలోని ఆయన నివాసంలో ఆయుష్ శాఖలో ఇటీవల మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన 138 మంది డాక్టర్లలో కొందరు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ఎంపికైన మెడికల్ ఆఫీసర్లకు త్వరలోనే నియామకపత్రాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్యం మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో డాక్టర్లు.... కిరణ్ కుమార్, అనిల్, సంపత్ కుమార్, విజేత, శ్రీదేవి, నిలోఫర్ అంజుమ్ ఉన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటోందని డాక్టర్లు తెలిపారు. వారికి అవకాశం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

**టీపీఎన్, సంగారెడ్డి:** ఇటీవల మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన డాక్టర్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. సంగారెడ్డిలోని ఆయన నివాసంలో ఆయుష్ శాఖలో ఇటీవల మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన 138 మంది డాక్టర్లలో కొందరు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ఎంపికైన మెడికల్ ఆఫీసర్లకు త్వరలోనే నియామకపత్రాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్యం మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో డాక్టర్లు.... కిరణ్ కుమార్, అనిల్, సంపత్ కుమార్, విజేత, శ్రీదేవి, నిలోఫర్ అంజుమ్ ఉన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటోందని డాక్టర్లు తెలిపారు. వారికి అవకాశం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

# బీసీ రిజర్వేషన్లు.. కాంగ్రెస్ వ్యూహానికి బూస్టప్‌గా మారుతాయా?

**టీపీఎన్, సూరజ్ రెడ్డి:** తెలంగాణలో బీసీల ఓటు బ్యాంకుపై పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కీలకంగా అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన దిశగా తీసుకున్న తాజా నిర్ణయం, రాబోయే ఎన్నికల ముందు రాజకీయంగా బలమైన వ్యూహంగా మారబోతోందని భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే జీవో విడుదల చేసి అధికారికంగా అమలుకు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.ఈ జీవో రూపకల్పనకు పంచాయతీరాజ్ చట్టం-2018లో గతంలో చేసిన సవరణలు, ఇప్పటికే ఆమోదించిన ఆర్డినెన్స్, అలాగే బీసీ జనాభా గణాంకాలు, నూతన మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సమర్పించే నివేదికలు ఆధారంగా మారతాయి. ప్రభుత్వం కమిషన్‌ను మరోసారి నివేదిక ఇవ్వమని కోరగా, అది అందిన వెంటనే వారం రోజుల్లోపు న్యాయపరమైన చిక్కులు లేకుండా జీవో విడుదల చేయాలన్నది ప్రభుత్వ యోచన.తెలంగాణలో బీసీ వర్గం ఎంతో బలంగా ఉంది. రాష్ట్ర జనాభాలో సగం కంటే ఎక్కువ శాతం బీసీలే ఉన్నారు. ప్రతి ఎన్నికలో బీసీలు గెలుపోటములపై ప్రభావం చూపగల సామర్థ్యం కలిగిన వర్గం. ఈ వాస్తవాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ, బీసీ సంక్షేమాన్ని కీలక లక్ష్యంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తీర్మానం, బీసీల్లో సానుకూల దృక్పథాన్ని పెంచేలా చేస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.బీసీలు ఒకే తాటిపై నడిచే వర్గం కాకపోవడం, అనేక ఉపకులాలుగా విభజించబడి ఉండడం వల్ల ప్రతి కులానికి దానికదే ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక నేపథ్యం ఉంటుంది. గతంలో బీసీలు వివిధ పార్టీలకు మద్దతు ఇచ్చినప్పటికీ, టీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలు వారి ఆశలను పూర్తిగా నెరవేర్చలేకపోయాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీసీలకు రిజర్వేషన్ల రూపంలో ఇచ్చిన హామీ, కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.జెడ్పీటీసీ, ఎంపిటీసీ స్థాయిలో బీసీలకు ఎక్కువ సీట్లు రావొచ్చన్న అంచనాలతో కాంగ్రెస్ ముందుగానే ఈ వ్యూహాన్ని సిద్ధం చేసిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం పెరిగితే, తద్వారా పార్టీకి ప్రాధాన్యత పెరుగుతుందని నాయకులు భావిస్తున్నారు. కానీ, బీసీల ఓటు బ్యాంకును పూర్తిగా తనవైపు తిప్పుకోవాలంటే, కాంగ్రెస్ పార్టీకి ఇంకా చాలాపనులుండే అవకాశముంది. కేవలం రిజర్వేషన్లతోనే కాకుండా, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి రంగాల్లో కూడా సమగ్ర ప్రణాళికను చూపించాల్సిన అవసరం ఉంది.

ఇక బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే ప్రక్రియలో ఇతర వర్గాలు, ముఖ్యంగా రెడ్డి, వెలమ, కమ్మ, ఎస్సీ, ఎస్టీ వంటి వర్గాల్లో ఏమేరకు స్పందన ఉంటుందనేది ప్రశ్నార్థకం. ఈ వర్గాల్లోని కొందరు తమ ప్రాధాన్యత తగ్గిందని భావిస్తే, వారు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయన్న హెచ్చరికలు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో రెడ్డి, వెలమ వర్గాల ప్రభావం ఎప్పటికీ ఉంటూనే ఉంది. అంతేగాక, ఎస్సీ, ఎస్టీలకు కూడా రాష్ట్రంలో గణనీయమైన ఓటు శాతం ఉంది. ఈ వర్గాల సంక్షేమాన్ని విస్మరించి కేవలం బీసీలపై మాత్రమే దృష్టి పెట్టడం కాంగ్రెస్ పార్టీకి నష్టాన్ని తెచ్చే ప్రమాదం ఉంది.ప్రతిపక్ష పార్టీలు కూడా బీసీలను ఆకర్షించేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. బీఆర్ఎస్ పార్టీ గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ మళ్లీ మద్దతు సాధించే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ కూడా కేంద్ర పథకాలను హైలైట్ చేస్తూ బీసీ ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నంలో ఉంది.



బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీకి ఒక శుభారంభంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. కానీ, ఈ ఒక్క నిర్ణయంతోనే బీసీల ఓట్లు మొత్తం తమవైపు వచ్చేస్తాయని ఆశించడం తగదు. బీసీ ఓటు బ్యాంకును స్థిరంగా మార్చుకోవాలంటే, కాంగ్రెస్ పార్టీ సమగ్రంగా అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోయేలా స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాల్సి ఉంటుంది. లేకపోతే, బీసీ రిజర్వేషన్ల అంశం కూడా ఓ పరిమిత రాజకీయ పాచికగా మాత్రమే మిగిలిపోతుంది.

సామాజికంగా బలమైన బీసీలకు రిజర్వేషన్ ఇచ్చిన నిర్ణయం, కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో బూస్టప్ ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఈ నిర్ణయం వల్లనే బీసీల ఓటు బ్యాంకు పూర్తిగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుందనుకోవడం కూడా సమంజసం కాదు. బీసీలకు నచ్చేలా జాతీయ స్థాయిలో విద్య, ఉపాధి అవకాశాలపై స్పష్టమైన ప్రణాళిక, క్రమబద్ధమైన అమలు ఉంటేనే, వారిని శాశ్వత ఓటు బ్యాంకుగా మార్చుకునే అవకాశముంటుంది. కాంగ్రెస్ బీసీ కార్డు ఎన్నికల కోసం వేసిన రాజకీయ పాచికగానే మిగిలిపోతుందా? సక్సెస్ అవుతుందా అనేది.. అమలుపైనే ఆధారపడి ఉంది.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలి

**టీపీఎన్, కొత్తగూడెం:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా రఘురాం రెడ్డిని నియమించినట్లు పొంగులేటి ప్రకటించగా, స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీలు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల వివరాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఖజానాను లూటీ చేసిందని, కుంగిన కాళేశ్వరం, ధరణి పేరిట ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు.



# పార్టీ లైన్‌కే కట్టుబడి ఉండాలి

**టీపీఎన్, హైదరాబాద్:**

తెలంగాణ బీజేపీ కీలక సూచనలు జారీ చేసింది. వివాదాస్పద అంశాలపై పార్టీ లైన్‌కు విరుద్ధంగా లేదా అనధికారికంగా మీడియా వేదికగా వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ నేతలకు స్పష్టం చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఈ సూచనలను వెల్లడించారు. మీడియా ముందు మాట్లాడే విషయంలో పార్టీ నిర్ణయించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ లైన్‌కు విరుద్ధంగా పత్రికా సమావేశాలు, మీడియా వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేశారు. కేవలం పార్టీ సూచించిన వ్యక్తులే మీడియా వేదికగా మాట్లాడాలని వెల్లడించారు.




# HCA అవకతవకలపై సీఐడీ, ఈడీ దూకుడు

**టీపీఎన్, హైదరాబాద్:**

HCA అక్రమాలపై సీఐడీ విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ వ్యవహారంలో మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును సీఐడీ అధికారులు ఉప్పల్ స్టేడియానికి తీసుకెళ్లారు. ఆయన సమక్షంలో డాక్యుమెంట్లను పరిశీలించారు. స్టేడియం టెండర్లు, టికెట్ల విక్రయం నుంచి బయటి కాంట్రాక్టుల వరకు అనేక అవకతవకలపై విచారించారు. గత పదేళ్లలో BCCI నుంచి HCAకు రూ.800 కోట్లకు పైగా నిధులు వచ్చినప్పటికీ వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడినట్టు ఆరోపణలు వచ్చాయి. బాల్స్, స్టేడియం కుర్చీలు, జిమ్ పరికరాల కొనుగోళ్లలో తీవ్ర అవినీతి జరిగిందని ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణలోనూ టెండర్ల కేటాయింపులో జగన్ తన అనుచరులకే లాభం చేకూర్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫుడ్ క్యాటరింగ్, స్టాల్స్, టికెట్ల కేటాయింపులోనూ అదే తరహాలో టెండర్లను తన మద్దతుదారులకే కట్టబెట్టినట్టు సమాచారం. ఈ వ్యవహారాలపై ఇప్పటికే ఈడీ దర్యాప్తును ప్రారంభించింది. జగన్ ఎవరెవరికీ ఎంత ముడుపులు చెల్లించి HCAలోకి ఎంట్రీ ఇచ్చారనే కోణంలో విచారణ కొనసాగుతోంది.



# అక్రమ కల్లు అమ్మకాలపై ఎస్‌టీఎఫ్ చర్యలు

**టీపీఎన్, రంగారెడ్డి:**

షాద్‌నగర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఎస్‌టీఎఫ్ బృందం అనుమతి లేని కల్లు దుకాణంపై దాడి నిర్వహించింది. కొత్తూరు ఎస్‌టీఎఫ్ బీటీం సీఐ బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు నేతృత్వంలో నిర్వహించిన ఈ దాడిలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా కల్లు అమ్మకాలు నిర్వహిస్తున్న సత్తయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశారు. దాడిలో మొత్తం 156 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. శాంపిల్‌ను సేకరించి నిందితుడిని సంబంధిత వివరాలతో షాద్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్టు అధికారులు తెలిపారు. అక్రమ కల్లు విక్రయాలపై చర్యలు కొనసాగుతాయని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది.



# పాతబస్తీలో రెచ్చిపోయిన ముఠాలు: సీపీ వార్నింగ్

టీపీఎన్, హైదరాబాద్: పాతబస్తీ ప్రాంతాల్లో ముఠాల మధ్య ఆధిపత్య పోటీ తీవ్ర రూపం దాల్చుతోంది. సౌత్, సౌత్‌ఈస్ట్, సౌత్‌వెస్ట్ జోన్‌ల పరిధిలో ఎనిమిది రౌడీ గ్యాంగులు పరస్పరంగా ఘర్షణలకు దిగుతున్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో పురానీ హవేలీలోని కోత్వాల్ హౌస్‌లో శుక్రవారం ఎగ్జిక్యూటివ్ కోర్టు నిర్వహించారు. SHOలు, ACPలు అందించిన సమాచారం మేరకు ఇప్పటికే పలు ఘర్షణలు, హత్యలు, హత్యాయత్నాలు చోటు చేసుకున్నట్టు కమిషనర్ ముందుంచిన నివేదికల్లో వివరాలు వెల్లడించారు. మిర్చౌక్, కాలాపత్తర్, బండ్లగూడ, కాంచన్‌బాగ్, సంతోష్‌నగర్, మంగళ్‌హాట్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్యాంగుల మధ్య ప్రతీకార దాడులు, కుటుంబ సభ్యులపై కక్ష సాధింపు చర్యలు, డ్రగ్స్, రియల్ ఎస్టేట్, ఆర్థిక లావాదేవీలతో ముడిపడ్డ హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. కోర్టు విచారణ సందర్భంగా గ్యాంగుల సభ్యులను విడిగా విచారించిన సీపీ సీవీ ఆనంద్, తమ పాత విభేదాలను మరచి శాంతికి కట్టుబడాలని వారిని హెచ్చరించారు. చెరలో ఉంటూ చట్టాన్ని లొంగదీసుకోవాలేకపోతే నగరంలో నుండే బయటకు పంపించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై 126 BNSS సెక్షన్ ప్రకారం బాండ్లు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.




# వర్షంతో కుత్బుల్లాపూర్‌లో జలదిగ్బంధం

**టీపీఎన్, కుత్బుల్లాపూర్:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చింతల్‌లోని గణేష్‌నగర్, సూరారం కాలనీల్లో లోతట్టు ఇళ్లన్నీ వర్షపు నీటితో మునిగిపోయాయి. రోడ్ల పైకి వరద నీరు వచ్చి చేరడంతో వాహనాలు స్థంభించాయి. బయట పార్కింగ్ చేసిన వాహనాలూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, గేట్లు తెరవగలిగే స్థితి లేకపోవడంతో ప్రజలు బందీలయ్యారు. కాలు బయట పెడదామంటే కూడా భయం వేస్తోందని స్థానికులు భయందోళనలకు గురయ్యారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఏటా ఇలాగే వర్షాకాలం వచ్చిందంటే ఇవే పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గండి మైసమ్మ నుంచి మేడ్చల్‌కు వెళ్లే రోడ్డుపై వర్షానికి పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. వాహనదారులు మార్గమధ్యంలో నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కాస్త తగ్గిన.. మున్సిపల్ సిబ్బంది దృష్టి పడేదాకా సమస్య పరిష్కారమయ్యే సూచనలు లేవని స్థానికులు వాపోతున్నారు.



# ఆటోను తీసుకెళ్లిన వరద.. మహిళలను కాపాడిన స్థానికులు

**టీపీఎన్, మేడ్చల్:**

నాచారం భవానినగర్‌లో నాలా వద్ద వరద ప్రవాహానికి ఓ ఆటో కొట్టుకుపోయింది. అందులో ప్రయాణిస్తున్న మహిళలు ఉన్నారు. దగ్గరలో ఉన్న స్థానికులు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా బయటకు తీసారు. వరద ఉధృతి తట్టుకోలేక ఆటో కొంతదూరం పోయింది. ఈ దృశ్యాన్ని గమనించిన వారు తమ ప్రాణాలను లెక్కచేయకుండా కిందకి దిగి మహిళలను రక్షించారు. ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న మహిళలను కాపాడిన పౌరులు స్థానికులకు అభినందించారు.



# నిషేధిత వస్తువుల రవాణా నిరోధానికి తనిఖీలు



**టీపీఎన్, మల్కాజిగిరి:**

డీసీపీ పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో నాకా బందీ నిర్వహించారు. నాచారం ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాలను ఆపి క్షుణంగా తనిఖీలు చేపట్టారు. నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నివారణతో పాటు, నంబరు ప్లేట్లను టాంపరింగ్ చేసిన వారి పై, నంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నామని డీసీపీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## సాగునీటి విడుదలతో రైతులకు ఊరట

**టీపీఎన్, నాగర్ కర్నూల్:**

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి గుడిపల్లి రిజర్వాయర్‌లో మోటార్ స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి గ్రామంలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మితమైన రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. దీంతో నాగర్‌కర్నూల్, వనపర్తి, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని రైతులకు ఎంతో ఊరట లభించింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపునిచ్చిందని మల్లు రవి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తిచేసి చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని వెల్లడించారు.



## కట్ట మైసమ్మ ఆలయంలో బోనాల సందడి

**టీపీఎన్, రంగారెడ్డి:**

ఆషాఢ మాసం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుటుంబం తరపున ఆమె కుమారుడు కౌశిక్ రెడ్డి జిల్లెలగూడ కట్ట మైసమ్మ అమ్మవారికి బోనం సమర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆలయం వరకు భారీ ఊరేగింపు చేశారు. పోతరాజుల వీరంగం, శివసత్తుల ఆటపాటలు, భజంత్రీల ధ్వనులు ఈ వేడుకకు ఆకర్షణగా నిలిచాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు లక్ష్మయ్య, ఆర్కేపురం అధ్యక్షులు నాగేష్, మహేశ్వరం మండల అధ్యక్షుడు రాజు నాయక్, కందుకూరు మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, అంజయ్య గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, సబితా ఇంద్రారెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## "అధికారంలో మీరు... ప్రజల గుండెల్లో మేము"

**టీపీఎన్, మల్కాజిగిరి:**

అల్వాల్ బోనాల సందర్భంగా జరిగిన దాడి ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గౌతమ్ నగర్ కార్పొరేటర్ సునీత యాదవ్ భర్త మేకల రాము యాదవ్‌ను స్వయంగా పరామర్శించారు. రాము యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేటీఆర్, పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నేతపై చేసిన దాడిని కేటీఆర్ ఖండించారు. "ఇప్పుడు మీ చేతిలో అధికారముందేమో కానీ... ప్రజల గుండెల్లో మాత్రం ఇంకా మేమే ఉన్నాం" అంటూ కేటీఆర్ స్పష్టం చేవారు. "కొంతమంది అధికారులు అధికార పార్టీ నేతలతో కలిసి వ్యవహరిస్తుంటే.... వాళ్ల పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తాం" అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.



## అభివృద్ధికి కాంగ్రెస్‌నే మార్గం: కవ్వంపల్లి

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**

అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ కల్పన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మానకొండూర్ మండల కేంద్రంలోని సుప్రీం ఫంక్షన్ హాల్లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వడంలో కూడా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. 2.4 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11.30 లక్షల మందికి లబ్ధి కలగనుందని వెల్లడించారు. మానకొండూర్ మండలానికి ఇప్పటి వరకు 2,043 కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. అర్హులందరికీ కార్డులు అందే వరకు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది**

తిమ్మాపూర్ మండలం పర్లపల్లిలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మొగిలిపాలెం, నల్లగొండ, బాలయ్యపల్లి, మక్త, పోలంపల్లి, నర్సింగపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కవ్వంపల్లి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిలు కలిసి కార్డులు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్సాహంతోనే రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ మొదలైందని ఎమ్మెల్యే అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలల్ని నిజం చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు. అర్హులందరికీ కార్డులు అందేలా చర్యలు కొనసాగుతాయని చెప్పారు.

**కాంగ్రెస్ గెలుపు దిశగా మరో అడుగు!**

ఇల్లంతకుంట మండలంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజా భవన్‌లో కవ్వంపల్లి సమక్షంలో సిరికొండ మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, తెనుగానిపల్లె మాజీ సర్పంచ్ వంచ అనసూర్య-చంద్రారెడ్డి వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సంక్షేమ పథకాలతో ఆకర్షితులైన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని ముందుకొస్తుండటం హర్షించదగిన విషయమని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కవ్వంపల్లి స్పష్టం చేశారు.



## పినపాక అభివృద్ధిలో ముందంజ

**టీపీఎన్, భద్రాద్రి కొత్తగూడెం:**

బూర్గంపాడు మండలంలోని మార్కెట్ యార్డులో "ఇందిర మహిళా శక్తి సంబరాలు" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. "ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇప్పటి వరకు 4 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం మూడు విడతల్లో సాయాన్ని అందించబోతున్నాం" అని ప్రకటించారు. "ఇందిరమ్మ ఇళ్లు లభించిన మహిళల కళ్లలో ఆనందంతో కూడిన కన్నీళ్లు కనిపిస్తున్నాయి. ఇది మన పథకాల ప్రభావం," అని పేర్కొన్నారు. "పార్టీలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి




ఒక్కరికి ఇళ్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను అందిస్తాం" అని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఉచిత విద్యుత్ పథకాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ ఫ్రీ అని చెప్పారు. గత పాలనపై విమర్శలు చేస్తూ— "పదేళ్లలో పెదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేకపోయారు. డబుల్ బెడ్‌రూమ్‌లను ఇవ్వలేకపోయారు. గ్యాస్ ధరను రూ.500కి తేల్చలేకపోయారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాష్ట్రాన్ని పందికొక్కులా దోచిన వాళ్లు ఇప్పుడు ముఖం చాటకుంటున్నారు. దోచిన సొమ్ముతో అయ్యా కొడుకును విదేశాలకు పంపారు" అని మండిపడ్డారు. "అప్పుడు పావలావడ్డీ లాంటీ సాధారణ పథకాన్ని కూడా ఇవ్వలేని అసమర్థత చూపిన వారు ఇప్పుడు మాటలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు" అని విమర్శించారు. "నా నియోజకవర్గం పాలేరు తర్వాత అభివృద్ధిలో ముందున్న నియోజకవర్గం పినపాక" అని అభిమానం వ్యక్తం చేసిన మంత్రి.... "ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా.. సంక్షేమం నిలుపుకుంటూ మెల్లగా అన్ని హామీలను నెరవేర్చుతున్నాం" అని చెప్పారు. మాట ఇస్తే తప్పని ప్రభుత్వం అదే ఇందిరమ్మ ప్రభుత్వం విశ్వాసం అని పొంగులేటి ప్రజలకు హామీ ఇచ్చారు.



## స్థానిక ఎన్నికల్లో గెలుపు వ్యూహంపై దిశా నిర్దేశం

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇవ్వబడతాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కష్టపడి పనిచేస్తూ ప్రజల్లో విశ్వాసం కలిగిన నేతలకే టిక్కెట్లు ఇస్తామన్నారు. వారిని గెలిపించే బాధ్యతను తానే భుజాన వేసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రూపుల రాజకీయాలకు బీజేపీలో చోటు లేదని.. బీజేపీలో ఒక్కటే గ్రూప్ అది మోదీ గ్రూప్ మాత్రమేనని స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థుల ఎంపిక, గెలుపు వ్యూహాలపై చర్చించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "ఎవరైనా బండి సంజయ్ గ్రూప్, లేదా మరో గ్రూప్ అని ప్రచారం చేస్తే వారికి బీజేపీలో స్థానం లేదు. గ్రూపు రాజకీయాలు చేసేవాళ్లకు టిక్కెట్లు రావు. బీజేపీ జెండా కోసం పని చేయాలి. వ్యక్తిగతంగా ఎవరిపట్లనైనా మక్కువ ఉంటే అది పార్టీకి మేలు చేయదు. అలాంటి వాళ్లకు ప్రోత్సాహం ఉండదు" అని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ప్రస్తుతం సాగుతున్న 19 నెలల కాంగ్రెస్ పాలనలో అయినా పంచాయతీల్లో అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో కాకుండా.. కేంద్రం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి సాధ్యమైందని గుర్తు చేశారు. ముఖ్యంగా ఎంపీ లాడ్స్ నిధులు, సీఐఆర్ఎఫ్, ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలు, మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బలమైన నేతలున్న చోట వారికే టిక్కెట్లు కేటాయిస్తామన్నారు. ఇతరచోట్ల గెలుపు సాధ్యమైన నాయకులను గుర్తించి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. బీజేపీకి రాష్ట్రవ్యాప్తంగా అనుకూల వాతావరణం ఉందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు

## విద్యలో విధాన సవాళ్లు మరియు సామాజిక తప్పిదాలు..!






ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు : "ఏబిలిజం" మరియు "ప్రత్యేక అవసరాలు" అనే పదాలు రెండు వేర్వేరు కానీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన భావనలను సూచిస్తాయి, ఇవి వ్యక్తుల అనుభవాలను ప్రపంచవ్యాప్తంగా గాఢంగా ప్రభావితం చేస్తాయి, తరచుగా వివక్షకు దారితీస్తాయి. "ప్రత్యేక అవసరాలు" అనేది శారీరక, మానసిక, బౌద్ధిక, లేదా ఇంద్రియ సంబంధిత అవసరాలను సూచిస్తుంది, ఇవి వివిధ అడ్డంకులతో సంకర్షణలో, సమాజంలో పూర్తి భాగస్వామ్యాన్ని అడ్డుకోవచ్చు. ఏబిలిజం అనేది ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులపై వివక్ష మరియు సామాజిక పక్షపాతం, ఇది సాధారణ సామర్థ్యాలు ఉన్నతమైనవి అనే నమ్మకంలో మూలాలు కలిగి ఉంటుంది. ఈ విస్తృత భావజాలం స్పష్టంగా మరియు సూక్ష్మంగా వ్యక్తమవుతుంది, ప్రభుత్వ విధానాలలో ముఖ్యమైన సవాళ్లను సృష్టిస్తూ, ముఖ్యంగా విద్యలో విస్తృతమైన సామాజిక అపోహలను పెంపొందిస్తుంది. నిజంగా సమ్మిళిత మరియు సమాన సమాజాలను నిర్మించడానికి ఈ సమస్యలను పరిష్కరించడం చాలా కీలకం.

ఏబిలిజం యొక్క సారాంశం ఏమిటంటే, ప్రత్యేక అవసరాలు లేని వ్యక్తులు ఆదర్శ మానవ రూపాన్ని సూచిస్తారని ఊహిస్తుంది, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు "సరిచేయబడాలి" లేదా స్వాభావికంగా "తక్కువ" అని సూచిస్తుంది. ఈ నమ్మకం ప్రతికూల దృక్పథాన్ని కొనసాగిస్తుంది, ప్రత్యేక అవసరాలను "వైకల్యం" అని చిత్రీకరిస్తుంది, ఇది మానవ అనుభవంలో సహజమైన వైవిధ్యం కాకుండా లోపంగా భావిస్తుంది. ఏబిలిజం బెదిరింపు వంటి శత్రుత్వ చర్యల నుండి, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులను హానిచేసే కానీ దయగల దృక్పథాల వరకు విస్తరిస్తుంది, వారిని బలహీనులుగా లేదా జాలిపడవలసిన వస్తువులుగా చూస్తుంది. వ్యవస్థాగతంగా, ఇది సామాజిక నిబంధనలు మరియు శక్తి నిర్మాణాలలో ఇమిడి ఉంటుంది, తరచుగా అపశక్తిగా పనిచేస్తుంది, దానిని గుర్తించడం మరియు పరిష్కరించడం సవాలుగా ఉంటుంది. ప్రత్యేక అవసరాలు మరియు సామాజిక సవాళ్లను అర్థం చేసుకోవడానికి సామాజిక నమూనా ఒక కీలకమైన దృక్పథం. వైద్య నమూనా ప్రత్యేక అవసరాలను వ్యక్తిగత లోపంగా చూస్తుంది, కానీ సామాజిక నమూనా సవాళ్లు సామాజిక అడ్డంకుల నుండి ఉత్పన్నమవుతాయని పేర్కొంటుంది. ఈ అడ్డంకులు, వ్యక్తి యొక్క పరిస్థితి కాదు, భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయి. ఉదాహరణకు, వీల్‌చైర్ ఉపయోగించే వ్యక్తి వారి చలనశీలత వల్ల పరిమితం కాదు, కానీ ర్యాంపులు లేకపోవడం లేదా సులభంగా అందుబాటులో లేని రవాణా వల్ల పరిమితం అవుతారు. ఈ దృక్పథం బాధ్యతను సమాజంపైకి మారుస్తుంది, అడ్డంకులను తొలగించడానికి అనుగుణంగా మార్చడానికి, వ్యక్తులను "వైకల్యం" గలవారిగా లేబుల్ చేయడం కాదు. "వైకల్యం" మరియు "డిసేబుల్" అనే పదాలే సమస్యాత్మకమైనవి; వ్యక్తులను వారు సాధారణంగా చేయలేని పనుల ద్వారా నిర్వచించడం కాకుండా, వారు విభిన్నంగా పనులు చేయగలరని అభినందించి, వారిని "విభిన్న సామర్థ్యం కలిగినవారు"గా గుర్తించాలి.

ప్రభుత్వ విధానాలు, తరచుగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నప్పటికీ, వాటి రూపకల్పన మరియు అమలులో ఏబిలిజాన్ని కొనసాగిస్తాయి. సులభంగా అందుబాటులో లేని వాతావరణాలు మరియు పాఠ్యాంశాలను సృష్టించడం మరియు నిర్వహించడం ఒక ప్రధాన సవాలు. పబ్లిక్ ప్రదేశాలు, రవాణా, మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సార్వత్రిక రూపకల్పనను తప్పనిసరి చేయడంలో విధానాలు తరచుగా విఫలమవుతాయి, దీనివల్ల ర్యాంపులు లేని మెట్లు, అందుబాటులో లేని టాయిలెట్లు, వీడియోలు మరియు చిత్రాలపై ఆడియో వివరణలు లేకపోవడం, లేదా సహాయక సాంకేతికతలతో అనుకూలంగా లేని సంక్లిష్ట ఆన్‌లైన్ సేవలు వంటి భౌతిక అడ్డంకులు ఏర్పడతాయి. ఈ వ్యవస్థాగత పర్యవేక్షణ విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను అవసరమైన సేవలు, ఉపాధి, మరియు పౌర భాగస్వామ్యం నుండి మినహాయిస్తుంది. చారిత్రాత్మకంగా, విధానాలు యూజెనిక్స్ ఉద్యమం లేదా ఓటు హక్కులను నిరాకరించడం వంటి స్పష్టమైన వివక్షను కలిగి ఉండేవి. నేటిగా, విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు ఉపాధిలో సౌకర్యాలకు తగిన నిధులు లేకపోవడం లేదా ప్రయోజనాలను పొందడానికి సంక్లిష్టమైన బ్యూరోక్రాటిక్ ప్రక్రియల ద్వారా విధానాలు పరోక్షంగా వివక్షను కొనసాగిస్తాయి. అంతేకాక, రాజకీయ కార్యాలయాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం వల్ల వారి ప్రత్యేక దృక్పథాలు తరచుగా విధాన రూపకల్పనలో పట్టించుకోబడవు, ఇది అసమర్థమైన పరిష్కారాలకు దారితీస్తుంది. విద్యలో, పాతబడిన బోర్డులు మరియు పద్ధతులు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి. సాంప్రదాయ పెన్‌అండ్‌పేపర్ వ్యవస్థలు, తీక్షణమైన కళ్ళు, చెవులు, మరియు నరాలను డిమాండ్ చేస్తాయి, అనుకూల జ్ఞాన సముపార్జన మరియు వివరణను సమకూర్చడంలో విఫలమవుతాయి. ఇది విభిన్న సామర్థ్యం కలిగిన విద్యార్థులు వృద్ధి చెందడానికి సంఘర్షించే వ్యవస్థను కొనసాగిస్తుంది. గుర్తుంచుకోండి, విరిగిన వ్యక్తులను సరిచేయడం కంటే బలమైన పిల్లలను నిర్మించడం ఎల్లప్పుడూ సులభం, సామాజిక వైఫల్యం మరియు నిరుద్యోగం వల్ల ఈ సమాజాల వృద్ధుల ఆధారపడటం మరియు నైపుణ్యాల కొరతను చూస్తే. విధాన వైఫల్యాలతో సమాంతరంగా, ప్రత్యేక అవసరాల గురించిన విస్తృత సామాజిక తప్పిదాలు సవాళ్లను గణనీయంగా తీవ్రతరం చేస్తాయి. ఇది హానికరమైన స్టీరియోటైప్‌లలో వ్యక్తమవుతుంది: ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు శాశ్వతంగా ఆధారపడేవారు, సామాజిక భారం, లేదా విషాద వ్యక్తులుగా చూడబడతారు. దీనికి విరుద్ధంగా, కొందరు రోజువారీ జీవితాన్ని నావిగేట్ చేయడం ద్వారా "ప్రేరణాత్మక" అని చూడబడతారు, దీనిని "ఇన్‌స్పిరేషన్ పోర్న్" అని పిలుస్తారు, ఇది వారి అనుభవాలను ఒక వినోదంగా తగ్గిస్తుంది. ఈ స్టీరియోటైప్‌లు వ్యక్తుల స్వయంప్రతిపత్తిని లాగేస్తాయి, అతిరక్షణ, దయగల దృక్పథాలు, మరియు వారు సంతృప్తమైన జీవితాలను గడపలేరని లేదా ఉత్పాదకంగా ఉండలేరని ఊహించడం వంటి ఫలితాలకు దారితీస్తాయి. సూక్ష్మమైన మాటలు లేదా ప్రవర్తనల ద్వారా వ్యక్తమయ్యే మైక్రోఅగ్రెషన్‌లు, ఏబిలిస్ట్ భాష లేదా ఆక్రమణాత్మక ప్రశ్నలు వంటివి, రోజువారీగా సంచితంగా, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తులను వారి ప్రత్యేక అవసరాల ద్వారా మాత్రమే నిర్వచించడం, వారి బహుముఖ గుర్తింపులను గుర్తించకపోవడం, సామాజిక బహిష్కరణకు మరింత దోహదం చేస్తుంది. ఏబిలిస్ట్ ప్రభుత్వ విధానాలు మరియు విస్తృత సామాజిక తప్పిదాల యొక్క సంచిత ప్రభావం గాఢమైనది. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు ఎక్కువ నిరుద్యోగం, పేదరికం, మరియు ఒంటరితనం రేట్లను ఎదుర్కొంటారు. అంధత్వం కలిగిన వ్యక్తులకు ఇది 99% మరియు చెవిటివారికి సమానంగా ఉంటుంది. వారు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు సమాజ భాగస్వామ్యానికి గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటారు. ఆశ్చర్యకరంగా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్య కోసం ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయలు కేటాయించబడతాయి, ఇవి తరచుగా జీతాలు మరియు కార్యక్రమ ఖర్చులలో అదృశ్యమవుతాయి, విద్యా సమానత్వం లేదా శ్రేష్ఠతపై ఏమీ ఫలితం ఇవ్వవు. ఈ నిధులలో ఒక పెద్ద భాగం, సీఎస్ఆర్ నిధులతో సహా, ప్రత్యేక పాఠశాలలను నడిపే ఎన్జీవోలకు వెళ్తుంది, తరచుగా పిల్లలు ఆధారపడే చక్రాన్ని కొనసాగిస్తాయి, టాక్స్‌చెల్లించే పౌరులుగా మారడం కంటే పెన్షన్‌లకు అనుగుణంగా ఉంటాయి. వ్యవస్థాగత అడ్డంకులు మరియు పక్షపాత దృక్పథాలతో నిరంతరం పోరాడటం దీర్ఘకాల ఒత్తిడి, మానసిక ఆరోగ్య సవాళ్లు, మరియు జీవన నాణ్యత తగ్గడానికి దారితీస్తుంది. అంతేకాక, ఈ బహిష్కరణ వల్ల సమాజం నష్టపోతుంది, విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులు అందించే విభిన్న ప్రతిభ, దృక్పథాలు, మరియు సహకారాలను కోల్పోతుంది.

ముగింపుగా, ప్రత్యేక అవసరాలను జీవన అనుభవంగా మరియు ఏబిలిజాన్ని వివక్షాపూరిత భావజాలంగా వేరు చేయడం న్యాయమైన ప్రపంచాన్ని పెంపొందించడానికి పునాదిగా ఉంటుంది. ప్రభుత్వ విధానాలలోని సవాళ్లు—సులభంగా అందుబాటులో లేని మౌలిక సదుపాయాల నుండి వివక్షాపూరిత అభ్యాసాల వరకు—మరియు హానికరమైన స్టీరియోటైప్‌లు మరియు మైక్రోఅగ్రెషన్‌ల ద్వారా కొనసాగించబడే విస్తృత సామాజిక తప్పిదాలు సమిష్టిగా విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తుల పూర్తి సమ్మిళనం మరియు సమానత్వానికి గణనీయమైన అడ్డంకులను సృష్టిస్తాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి సమన్వయ ప్రయత్నం అవసరం: ప్రభుత్వాలు నిజంగా సమ్మిళిత విధానాలను రూపొందించి, కఠినంగా అమలు చేయాలి, సార్వత్రిక అందుబాటు మరియు సమాన అవకాశాలను నిర్ధారించాలి. అదే సమయంలో, సామాజిక దృక్పథాలు జాలి మరియు పక్షపాతం నుండి నిజమైన గౌరవం, అవగాహన, మరియు విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను విభిన్న, సమర్థ, మరియు మానవ సమాజంలో అంతర్భాగంగా గుర్తించడం వైపు రూపాంతరం చెందాలి. వారి స్వరాలు మరియు అనుభవాలను కేంద్రీకరించడం ద్వారా, మనం ఏబిలిస్ట్ నిర్మాణాలను ధ్వంసం చేసి, అందరికీ నిజంగా అందుబాటులో ఉండే మరియు సమానమైన భవిష్యత్తును నిర్మించవచ్చు.



రామ్ కమల్, సోషల్ ఇంజినీర్,
ఏపీ సమగ్ర విద్య సలహాదారు

# జర్నలిస్టులు అంటే ఆయుధాలు లేని సైనికులు..!



సైనికుడు అనగానే, శారీరక ఆయుధాలతో సన్నద్ధమై, యుద్ధభూమిలో లేదా సాంకేతికంగా ఏదైనా కారణం కోసం పోరాడే వ్యక్తి మన కళ్ళ ముందు కనిపిస్తాడు. అయితే, విలేఖరి మాత్రం ఆయుధాలతో కాక, జ్ఞానం, పదాలు, మరియు సమాచారం ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే లోతైన అవగాహనతో సన్నద్ధమై ఉంటాడు. అయితే, ఈ సామ్యం ఇంకా లోతుగా ఉంది: సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ రంగాలలో ముందు వరుసలో ఉంటారు—శారీరకంగా మరియు సాంకేతికంగా. సైనికులు ఒక దేశాన్ని లేదా కారణాన్ని రక్షించడానికి పోరాడుతుంటే, విలేఖరులు సత్యం, ప్రజాస్వామ్యం, మరియు సమాచారం యొక్క సమగ్రతను రక్షించడానికి పోరాడతారు.

**సత్యం యొక్క యుద్ధభూమి**

సైనికుడి లక్ష్యం స్పష్టంగా ఉంటుంది: శత్రువును తటస్థీకరించడం, సహచరులను రక్షించడం, మరియు భూభాగాన్ని సురక్షితం చేయడం. విలేఖరి యొక్క లక్ష్యం, అంత స్పష్టంగా కనిపించకపోయినా, ఏ మాత్రం తక్కువ కీలకం కాదు: సత్యాన్ని వెలికితీయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు ప్రజాలను సమాచారం అందించడం. యుద్ధ ప్రాంతాలలో, విలేఖరులు సైనికుల వలె శారీరక ప్రమాదాలను ఎదుర్కొంటారు, కానీ వారు సేకరించే మరియు పంచే సమాచారం ఖచ్చితమైనది మరియు రాజకీయ అజెండాలు లేదా ప్రచారం ద్వారా కలుషితం కాకుండా ఉండేలా చూసుకోవడం అనే అదనపు సవాలును కూడా ఎదుర్కొంటారు.

రెండు సందర్భాలలోనూ, "యుద్ధభూమి" అధికార పాత్రలను కలిగి ఉంటుంది, మరియు కథనంను నియంత్రించే వారు—ఆయుధాల ద్వారా లేదా పదాల ద్వారా—ఘటనల దిశను రూపొందిస్తారు.

**ప్రభావం యొక్క సాధనాలు**

సైనికులు ప్రత్యక్ష శారీరక సంఘర్షణలో పాల్గొనడానికి ఆయుధాలను ఉపయోగిస్తారు, కానీ విలేఖరులు తమ వృత్తి సాధనాలను—కలం, కెమెరా, మైక్రోఫోన్, మరియు ఇంటర్నెట్—ప్రజల అవగాహనను ప్రభావితం చేయడానికి ఉపయోగిస్తారు. సరైన నివేదిక, సరైన ఫోటో, లేదా సరైన డాక్యుమెంటరీ సామాజిక ఉద్యమాలను రేకెత్తించవచ్చు, ప్రభుత్వాలను కూల్చవచ్చు, లేదా చరిత్ర గతిని మార్చవచ్చు.

ఉదాహరణకు, 1972లోని "నాపామ్ గర్ల్" ఫోటో లేదా పోలీసు హింస యొక్క వీడియో ఫుటేజ్ వంటి చిత్రాలు సైనికులు, రాజకీయ నాయకులు, లేదా మీడియా స్వయంగా కూడా ఊహించని విధంగా ప్రజల అభిప్రాయాన్ని మార్చగలవు. ఈ క్షణాలు, పదాలు మరియు చిత్రాలు స్వయంగా ఆయుధాలుగా ఉంటాయని గుర్తు చేస్తాయి, మరియు విలేఖరులు తరచూ ప్రజాస్పృహ యొక్క ముందు వరుసలో ఉంటారు.

**యుద్ధ బాధితులు**

సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ "యుద్ధాల" లో బాధితులుగా మారవచ్చు. సైనికులు యుద్ధభూమిలో తమ ప్రాణాలను పణంగా పెడతారు; విలేఖరులు, ముఖ్యంగా యుద్ధ ప్రాంతాలలో, జైలు శిక్ష, చిత్రహింసలు, లేదా మరణం వంటి ప్రమాదాలను ఎదుర్కొంటారు. జమాల్ ఖషోగ్గి, డాఫ్నే కరువానా గలిజియా, లేదా మేరీ కోల్విన్ వంటి ప్రముఖ విలేఖరులను గుర్తు చేసుకోండి, వారు సత్యాన్ని చెప్పడానికి తమ జీవితాలను త్యాగం చేశారు.

ఈ "ఆయుధాలు లేని సైనికులు" సైనికుల రక్షణ కవచం కలిగి ఉండకపోవచ్చు, కానీ వారు సత్యాన్ని డాక్యుమెంట్ చేయడానికి అచంచలమైన నిబద్ధతను కలిగి ఉంటారు—గొప్ప వ్యక్తిగత ప్రమాదం ఉన్నప్పటికీ. సైనికులు తమ త్యాగాల కోసం హీరోలుగా కీర్తించబడినట్లే, ఈ ప్రమాదాలను ఎదుర్కొనే విలేఖరులు అణచివేత వ్యవస్థలను సవాలు చేయడంలో లేదా అసౌకర్య సత్యాలను వెల్లడించడంలో వారి ధైర్యం కోసం తరచూ గౌరవించబడతారు.

**నైతిక మరియు ధార్మిక ముందు వరుసలు**

సైనికుడు మరియు విలేఖరి ఇద్దరూ తీసుకోవలసిన నైతిక మరియు ధార్మిక నిర్ణయాలలో కూడా ఈ సామ్యం నిలుస్తుంది. సైనికుడు తన చర్యల యొక్క ఖర్చును ఆలోచించాలి—యుద్ధం యొక్క నైతిక పరిణామాలు ఏమిటి, మరియు ఆత్మరక్షణ ఎప్పుడు దాడిగా మారుతుంది? అదేవిధంగా, విలేఖరి "సత్యాన్ని నివేదించడం యొక్క బాధ్యత ఏమిటి?" అనే నైతిక ప్రశ్నను ఎదుర్కొంటాడు. కేవలం వాస్తవాలను నివేదించడం సరిపోతుందా, లేక అన్యాయాన్ని సవాలు చేయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు స్వయంగా మాట్లాడలేని వారి కోసం న్యాయవాదిగా మారడం కూడా చేయాలా?

**పెద్ద లక్ష్యం ముఖ్యం**


ఇద్దరూ కష్టమైన పరిస్థితులలో కఠినమైన ఎంపికలను ఎదుర్కొంటారు—అది ట్రిగ్గర్ లాగడం కావచ్చు లేదా జీవితాలను ప్రమాదంలో పడవేసే సున్నితమైన కథనాన్ని ప్రచురించాలా వద్దా అని నిర్ణయించడం కావచ్చు. వస్తునిష్ఠత మరియు కార్యకర్తవాదం మధ్య గీత చాలా సన్నగా ఉంటుంది, కానీ ఇది తరచూ పెద్ద లక్ష్యం కోసం నడవబడుతుంది.

**ప్రతిఘటన మరియు స్థితిస్థాపకత**

ప్రతిఘటన ఉద్యమాలలోని సైనికుల వలె, విలేఖరులు కూడా ఆయుధాలతో నేరుగా పోరాడకపోయినా, మార్పు యొక్క ఏజెంట్లుగా ఉంటారు. అవినీతిని బయటపెట్టే, పర్యావరణ ప్రమాదాలను బహిర్గతం చేసే, లేదా మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి తెచ్చే పరిశోధనాత్మక విలేఖరులను గురించి ఆలోచించండి. వారు సవాలు చేసే అధికారాలచే ఎల్లప్పుడూ ప్రశంసించబడరు, మరియు తరచూ ప్రతీకారాన్ని ఎదుర్కొంటారు, అయినప్పటికీ వారి పని ప్రజాస్వామ్య సమాజాల ఆరోగ్యానికి కీలకమైనది.

**విలేఖరులు ఎక్కువ స్వేచ్ఛను అనుభవిస్తారు**

పత్రికా స్వేచ్ఛ బెదిరింపులకు గురవుతున్న దేశాలలో, విలేఖరులు తరచూ వ్యవస్థాగత అణచివేతను ఎదుర్కొంటారు—అధికార శాసన రాజ్యాలలో సైనికులు తాము నమ్మని యుద్ధాలలో పోరాడవలసి వచ్చినట్లే. అయితే, ఈ "ఆయుధాలు లేని సైనికుల" స్థితిస్థాపకత కొన్నిసార్లు ఇంకా శక్తివంతంగా ఉంటుంది, ఎందుకంటే వారు పోరాడడానికి ఉపయోగించే సాధనాలు—కలం, స్వరం, మరియు సత్యం—తీసివేయడం చాలా కష్టం. కాబట్టి, సంక్షిప్తంగా చెప్పాలంటే, "ఆయుధాలు లేని సైనికుడు" అనే సామ్యం, విలేఖరులు సాంప్రదాయ ఆయుధాలతో సన్నద్ధం కాకపోయినా, ధైర్యం, స్థితిస్థాపకత, మరియు తరచూ వ్యక్తిగత త్యాగం అవసరమైన అధికపణంగా యుద్ధంలో పాల్గొంటారని వివరిస్తుంది. వారి శక్తి కథనాలను రూపొందించడంలో, ప్రస్తుత స్థితిని సవాలు చేయడంలో, మరియు చివరికి, చరిత్ర గతిని మార్చడంలో ఉంది.



సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్.



# ఢిల్లీ స్కూళ్లకు వరుసగా నాలుగోసారి బాంబు బెదిరింపులు..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపు ఈమెయిళ్లు ఆగడం లేదు. గత వారం రోజుల్లో నాలుగోసారి 20కి పైగా స్కూళ్లకు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. ఈ మెయిళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరు పంపిస్తున్నారనేది పోలీసులు కూడా గుర్తించలేకపోతున్నారు. దీంతో స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ యంత్రాంగం ఆందోళనకు గురవుతున్నారు.



**బెదిరింపు ఈమెయిళ్ల వివరాలు**

ఈ రోజు ఢిల్లీలో 20కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. స్కూల్ ఆవరణలో పేలుడు పదార్థాలు అమర్చామని, బెదిరింపును పట్టించుకోకపోతే పిల్లలు ముక్కలవుతారని అగంతకులు ఈమెయిళ్లలో పేర్కొన్నారు. రోహిణి సెక్టార్ 3లోని అభినవ్ పబ్లిక్ స్కూల్, పశ్చిమ విహార్‌లోని రిచ్మండ్ గ్లోబల్ స్కూల్ సహా పలు స్కూళ్లకు ఈ బెదిరింపులు వచ్చాయి. వెంటనే స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపి, పోలీసులకు సమాచారం అందించాయి. పోలీసులు, బాంబు స్క్వాడ్, అగ్నిమాపక సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, ఎటువంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు.

**బెదిరింపు ఈమెయిల్‌లో ఏముంది?**

ఢిల్లీ స్కూళ్లు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయి. అయితే, ఈ బెదిరింపు ఈమెయిళ్లు ఉదయం 5:26 నుంచి 8:12 గంటల మధ్య వస్తున్నాయి. ఈమెయిల్‌లో, తాము తరగతి గదుల్లో ట్రినిట్రోటోలుయెన్ (TNT) పేలుడు పరికరాలను నల్లటి ప్లాస్టిక్ సంచుల్లో దాచిపెట్టామని, అందరినీ తుడిచిపెట్టేస్తామని, ఎవరూ బతకరని బెదిరించారు. "మీ చావు వార్తలు చూసి నవ్వుతాను, పిల్లల శరీర భాగాలు ముక్కలుగా పడి ఉండటం చూస్తాను. మీరు బాధపడటానికి అర్హులు," అని రాశారు.

ఈ బెదిరింపు రాసిన వ్యక్తి తన జీవితం పట్ల అసహ్యం వ్యక్తం చేస్తూ, పేలుడు తర్వాత ఆత్మహత్య చేసుకుంటానని, మనోరోగ వైద్యులు, మనస్తత్వవేత్తలు తనను పట్టించుకోలేదని, మానసిక మందులు హానికరమని ఆరోపించారు. "మీరు నాలాగే బాధపడాలి," అని ఈమెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

**వారంలో నాలుగోసారి బెదిరింపులు**

ఈ వారంలో ఢిల్లీ స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన నాలుగో సందర్భం ఇది. జూలై 16న ఎనిమిది స్కూళ్లకు, గత వారంలో మొత్తం 28 స్కూళ్లకు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులు స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిపాలనా వ్యవస్థలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. బెదిరింపులు రాగానే విద్యార్థులను స్కూళ్ల నుంచి ఖాళీ చేస్తున్నారు. తల్లిదండ్రులు హుటాహుటిన స్కూళ్లకు చేరుకొని పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్నారు.

వసంత్ కుంజ్‌లోని వసంత్ వ్యాలీ స్కూల్, హౌజ్ ఖాస్‌లోని మదర్ ఇంటర్నేషనల్, పశ్చిమ విహార్‌లోని రిచ్మండ్ గ్లోబల్ స్కూల్, పితంపురాలోని ప్రుడెన్స్ స్కూల్, లోధి ఎస్టేట్‌లోని సర్దార్ పటేల్ విద్యాలయం, సెయింట్ థామస్ స్కూల్‌లకు బెదిరింపులు వచ్చాయి.

**ఒక విద్యార్థి అరెస్ట్**

జూలై 15న ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈమెయిల్ పంపినందుకు 12 ఏళ్ల విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం మరో బాంబు బెదిరింపు ఈమెయిల్ పంపిన బాలుడిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇచ్చి అతని కుటుంబానికి అప్పగించినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ద్వారక) అంకిత్ సింగ్ తెలిపారు.

**కేంద్ర హోంశాఖ జోక్యం**

ఢిల్లీ స్కూళ్లకు వస్తున్న బాంబు బెదిరింపులపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఐపీ అడ్రస్‌లను మార్చడం, డార్క్ వెబ్ ద్వారా ఈమెయిళ్లు పంపడం వల్ల బెదిరింపులకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడం కష్టతరంగా ఉంది. ఈ బెదిరింపులు ఢిల్లీ శాంతిభద్రతలకు సవాలుగా మారడంతో కేంద్ర హోంశాఖ సీరియస్‌గా స్పందించింది. వరుస బాంబు బెదిరింపు ఈమెయిళ్లపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశించింది. ప్రస్తుతం ఈ ఫేక్ బాంబు బెదిరింపులపై దర్యాప్తు కొనసాగుతోంది.

# ఇండియా కూటమికి ఆమ్ ఆద్మీ పార్టీ షాక్..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇండియా కూటమికి ఊహించని షాక్ ఇచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల వరకే తమ కూటమి పరిమితమని ఆప్ స్పష్టం చేసింది. ఆప్ పార్లమెంటు సభ్యుడు సంజయ్ సింగ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ మరియు కాంగ్రెస్ ఇండియా కూటమి కింద కలిసి పనిచేశాయని, అయితే ఆ తర్వాత జరిగిన హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు స్వతంత్రంగా పోటీ చేశాయని తెలిపారు.



"మేము మా వైఖరిని చాలా స్పష్టంగా చెప్పాము. ఇండియా కూటమి పొత్తు లోక్‌సభ ఎన్నికలకే పరిమితం. పార్లమెంటులో ప్రభుత్వం తప్పుడు విధానాలను అమలు చేస్తే, మేము ఎప్పుడూ వాటిని ఎండగడుతాము. బీహార్, యూపీ, పూర్వాంచల్‌లో ఇళ్లు, దుకాణాలను బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. ఈ అంశాన్ని మేము పార్లమెంటులో లేవనెత్తబోతున్నాము," అని సంజయ్ సింగ్ అన్నారు. ఢిల్లీలోని మురికివాడలను బీజేపీ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం కూల్చేస్తోందని ఆయన ఆరోపించారు. జూలై నుంచి ఆగస్టు 21 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని తమ పార్టీ ప్రస్తావిస్తుందని చెప్పారు. ఇంతకు ముందు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఢిల్లీలోని స్లమ్ ఏరియాలను కూల్చడంపై బీజేపీ ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసన ర్యాలీలో, పేదలకు గూడు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. "50 డిగ్రీల ఎండలో మురికివాడలను కూల్చేస్తుంటే, పేదలు నిస్సహాయంగా రోడ్లపై కాలం గడుపుతున్నారు. ఎన్నికల ముందు నేను ఒక వీడియో విడుదల చేశాను. బీజేపీ కళ్లు పేదల భూములపైనే ఉన్నాయని, ఏడాదిలోగా వాటిని కూల్చేస్తారని, ఓటు వేసి పొరపాటు చేయవద్దని చెప్పాను. కానీ, ఐదు నెలల్లోనే బుల్డోజర్లతో ఢిల్లీని ధ్వంసం చేశారు,"



## నా చావుకు నా భార్యే కారణం

- **సెల్ఫీ వీడియోలో ఓ యువకుడి ఆవేదన**

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

ఢిల్లీలోని నిహాల్ విహార్ ప్రాంతానికి చెందిన వికాస్ అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు తన భార్య కారణం అంటూ సెల్ఫీ వీడియో ద్వారా తన బాధను వెలుబుచ్చాడు. తన భార్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కారణంగా తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. నా భార్య ఆమె కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుందని చెప్పాడు. నా కొడుకును నా తల్లిదండ్రులకు..సోదరికి అప్పగించాలని కోరారు. అప్పుల కారణంగా తన భార్య నాలుగేళ్ల బిడ్డను వదిలేసి షకీబ్ అనే యువకుడితో తిరుగుతోందని, నేను చాలా అప్పుల్లో కూరుకుపోయానని, దాని వల్ల ఇంట్లో గొడవలు జరిగాయని ఆయన అన్నారు. కానీ ఇప్పుడు నేను అప్పులన్నీ తీర్చేశాను, చనిపోతున్నాను. పోలీసులు ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని సూచించారు. గత కొన్ని రోజులుగా, ముఖ్యంగా పురుషులు, గృహ కలహాలతో ఇబ్బంది పడుతున్న వ్యక్తులు వీడియోల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి ఆత్మహత్య చేసుకున్న అనేక కేసులు వెలుగులోకి వచ్చాయని మీకు తెలియజేద్దాం. ఈ సందర్భంలో, అతుల్ సుభాష్‌కేసు చాలా చర్చనీయాంశమైంది.

# ఆన్‌లైన్‌లో ఇండియా బ్లాక్ వర్షా కాల సమావేశాలపై చర్చ

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు వ్యూహాన్ని రూపొందించడానికి కాంగ్రెస్ ఈ శనివారం ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించనుంది. ప్రతిపక్ష నాయకుల విస్తృత భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ముందుగా జరగాల్సిన సమావేశాన్ని ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు మార్చింది. చాలా మంది సీనియర్ నాయకులు తక్కువ సమయంలో ఢిల్లీకి రాలేకపోతున్నామని ప్రకటించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం ఇండియా బ్లాక్‌లోని దాదాపు అందరు ప్రముఖ నాయకులు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరుకానున్నారు. వీరిలో అఖిలేష్




యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), ఉద్ధవ్ థాకరే (శివసేనయుబిటి) , ఎంకె స్టాలిన్ (డిఎంకె) వంటి నాయకులు ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ (TMC) ఈ సమావేశంలో పాల్గొనడాన్ని ధృవీకరించిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ లేదా సీనియర్ నాయకుడు అభిషేక్ బెనర్జీ ఆన్‌లైన్‌లో ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్ సమావేశంలో TMC పాల్గొనడం ఇదే మొదటిసారి. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జరిగిన సమావేశాలకు ఆ పార్టీ ఇంతకుముందు దూరంగా ఉంది. అదే సమయంలో, ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) పాల్గొనడం గురించి ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది.

# కమిటీ నివేదికను సుప్రీకోర్టులో సవాల్ చేసిన జస్టిస్ యశ్వంత్‌వర్మ..!

**టీపీఎన్, ఢిల్లీ :**

తన ఇంట్లో నగదు దొరికిన కేసులో జడ్జీల కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా దర్యాప్తు చేపట్టారని ఆయన ఆరోపించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న సమయంలో, 2025 మార్చి 14న ఆయన ఇంటిలో భారీగా నోట్ల కట్టలు బయటపడిన విషయం తెలిసింది. పంజాబ్ మరియు హర్యాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్నాటక హైకోర్టు జస్టిస్ అను శివరామన్‌తో కూడిన ఇన్‌హౌస్ కమిటీ మే 4న ఓ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో జస్టిస్ వర్మ ఇంటి స్టోర్‌రూమ్‌లో నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రిపోర్టు ఆధారంగా, అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా, మే 8న జస్టిస్ వర్మను తొలగించాలని రాష్ట్రపతి మరియు ప్రధానమంత్రిని కోరారు. జస్టిస్ వర్మ, తనను తొలగించాలన్న సీజేఐ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని, ఇన్‌హౌస్ దర్యాప్తు తీరును ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాంతర రాజ్యాంగ వ్యవస్థను సృష్టించి విచారణ సాగించినట్లు ఆయన ఆరోపించారు. 1968 జడ్జీల రక్షణ చట్టం ప్రకారం ఇన్‌హౌస్ దర్యాప్తు జరగలేదని, అధికారిక ఫిర్యాదు లేకుండానే విచారణ చేపట్టడం అక్రమమని ఆయన పేర్కొన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేశారని ఆయన అన్నారు.

మార్చి 14 రాత్రి 11:35 గంటలకు జస్టిస్ వర్మ ఇంటి స్టోర్‌రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఆయన ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్నారు. ఫైర్ ఇంజన్లు మంటలను 15 నిమిషాల్లో ఆర్పివేశాయి. అయితే, స్టోర్‌రూమ్ నుంచి గుర్తు తెలియని నగదు రికవరీ అయింది. మంటల్లో కాలిపోతున్న నోట్ల కట్టలకు సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ ఆరోపణల నేపథ్యంలో జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.





# పృథ్వీII , అగ్నిI పరీక్షలు విజయవంతం

**టీపీఎన్, చాందీపూర్ :**

భారతదేశ బలం మరింత పెరిగింది. తన రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకుంటూ, భారతదేశం ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుండి రెండు స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను పృథ్వీII , అగ్నిI విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

**పృథ్వీ-II క్షిపణి లక్షణాలు**

పృథ్వీII అనేది దేశీయంగా అభివృద్ధి చేయబడిన ఉపరితలం నుండి ఉపరితలానికి ప్రయోగించే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి (SRBM). దీనిని రక్షణ పరిశోధన , అభివృద్ధి సంస్థ (DRDO) ఇంటిగ్రేటెడ్ గైడెడ్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమం (IGMDP) కింద అభివృద్ధి చేసింది. ఈ క్షిపణి 250 350 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. 5001000 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. ఈ క్షిపణి అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంది. అధిక ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడానికి వీలు కల్పించే అధునాతన జడత్వ నావిగేషన్ వ్యవస్థను కలిగి ఉంది. పృథ్వీIIని 2003లో భారతదేశ వ్యూహాత్మక దళ కమాండ్‌లో చేర్చారు. అదే సమయంలో పృథ్వీII క్షిపణిని అధిక పేలుడు, చొచ్చుకుపోయే శక్తి, క్లస్టర్ మందుగుండు సామగ్రి, ఫ్రాగ్మెంటేషన్, థర్మోబారిక్, రసాయన ఆయుధం , వ్యూహాత్మక అణ్వాయుధాలతో అమర్చవచ్చు.




# రాహుల్‌పై సీఎం హిమంత ఆగ్రహం

**టీపీఎన్, అసోం :**

రాహుల్ గాంధీపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు కబ్జాదారులను.."భూ జిహాదీలను" బహిరంగంగా ప్రోత్సహించారని ఆరోపించారు. అటవీ భూమిలో ప్రజలు స్థిరపడలేరని విషయం ఆయనకు అర్థం కాలేదన్నారు. కానీ ఆక్రమణదారులకు అదే స్థలంలో పునరావాసం కల్పించి, ఇళ్లు ఇస్తామని రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పైకాన్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కొంత భాగాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారు. వాటిని కూల్చివేయడానికి వెళ్లిన అటవీ గార్డులు , పోలీసు సిబ్బందిపై ఆక్రమణదారులు కర్రలతో దాడి చేశారని .. వారిపై రాళ్ళు రువ్వారని గోల్‌పారా జిల్లా కమిషనర్ ప్రొదీప్ తిముంగ్ తెలిపారు. ఈ ఘర్షణల్లో 21 మంది పోలీసులు గాయపడ్డారు . పోలీసు కాల్పుల్లో ఒక ఆక్రమణదారుడు మరణించాడు. గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రి పాలయ్యారు. రాహుల్ గాంధీ ర్యాలీలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని..వాటిని పరిశీలిస్తామన్నారు శర్మ.



# సీఎం ఫడ్నీవీస్‌తో ఉద్ధవ్ రహస్య సమావేశం

**టీపీఎన్, ముంబై :**

మహారాష్ట్రలో రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే , ప్రస్తుత ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసన మండలి చైర్మన్ రామ్ షిండే ఛాంబర్‌లో 20 నిమిషాల పాటు సమావేశం అయ్యారు. ఆదిత్య థాకరే.. పలువురు శివసేన (యుబిటి) ఎమ్మెల్యేలు హాజరయ్యారు. థాకరే, ఫడ్నవీస్ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యం గురించి ఊహాగానాలకు దారితీసింది. ఇది మహాయుతి కూటమిలోని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి ముప్పుగా పరిణమించింది. ఇద్దరు నాయకుల మధ్య జరిగిన చర్చలో అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకం, వివాదాస్పద త్రిభాషా విధానం వంటి కీలక అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఉద్ధవ్ థాకరే ఫడ్నవీస్ కు 'వై షుడ్ హిందీ బి ఇంపోజ్డ్?' అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. ముఖ్యమంత్రి దానిని త్రిభాషా విధానాన్ని సమీక్షించడానికి ఏర్పాటు చేసిన కమిటీ చైర్మన్ నరేంద్ర జాదవ్ కు అందజేయాలని సూచించారు. దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ ప్రతిపక్ష నాయకుడి పదవి అసెంబ్లీ స్పీకర్ అధికార పరిధిలోకి వస్తుందని, దీనిపై ఇంకా నిర్ణయం పెండింగ్ లో ఉందరన్నారు.

# TRF ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన అమెరికా

**టీపీఎన్, అమెరికా :**
రెసిస్టెన్స్ ఫ్రంట్ అనేది పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఒక ఫ్రంట్ సంస్థ మరియు కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడికి TRF బాధ్యత వహించింది, ఈ దాడిలో పాకిస్తాన్ మద్దతుగల ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను కాల్చి చంపారు.
అమెరికా ప్రభుత్వం ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF) ను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా ప్రకటించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రవాద దాడికి TRF బాధ్యత వహించింది. ఈ దాడిలో పాకిస్తాన్ మద్దతుగల ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను కాల్చి చంపారు.
రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF) అనేది పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (LeT) యొక్క ప్రధాన సంస్థ . కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను నిర్వహిస్తుంది. ఈ ఉగ్రవాద సంస్థను పాకిస్తాన్‌లో ప్రధాన కార్యాలయం ఉందని.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు ఒక ఫ్రంట్ అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అభివర్ణించారు.TRF ను ఉగ్రవాద సంస్థగా పేర్కొనడం ట్రంప్ పరిపాలన మన జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం , పహల్గామ్ దాడికి



న్యాయం కోరడం పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని రూబియో ఒక ప్రకటనలో తెలిపారు. పహల్గామ్ దాడికి TRF బాధ్యత వహించిందని 2008లో లష్కరే తోయిబా ముంబై దాడుల తర్వాత భారతదేశంలో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన ఉగ్రవాద దాడిగా అమెరికా అధికారులు దీనిని అభివర్ణించారు.కశ్మీర్‌లో భద్రతా దళాలపై అనేక దాడులుTRFను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా పేర్కొనడం వల్ల దాని సభ్యులపై కఠినమైన ఆర్థిక , ప్రయాణ ఆంక్షలు విధించబడతాయి. ఉగ్రవాద నిరోధక ప్రయత్నాలలో ప్రపంచ భాగస్వాములతో వాషింగ్టన్ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాయి. భారత భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులతో కూడా ఈ ఉగ్రవాద సంస్థ సంబంధం కలిగి ఉందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.ఈ ఏడాది ఏప్రిల్ 22న, జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లోని బైసరన్ లోయలోకి సాయుధ ఉగ్రవాదులు ప్రవేశించి పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని చంపారు. ఈ దాడి భారతదేశం అంతటా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఉగ్రవాదంపై పోరాటంలో అమెరికాతో సహా అనేక ప్రపంచ దేశాలు భారతదేశానికి సంఘీభావం ప్రకటించాయి. ఈ ఉగ్రవాద దాడి జరిగిన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి మృతులకు సంతాపం తెలిపారు.





## బ్రిటన్‌లో ఓటు వేసే వయస్సు 16 సంవత్సరాలు

**టీపీఎన్, బ్రిటన్ :** బ్రిటన్‌లో ఓటు వేసే వయస్సు విషయంలో నిబంధనలు మార్చివేసింది. 18 నుంచి 16 ఏళ్లకు తగ్గిస్తున్నట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. పోలింగ్ స్టేషన్లలో గుర్తింపుగా UK జారీ చేసిన బ్యాంక్ కార్డులను ఉపయోగించుకునేలా ఓటరు ID వ్యవస్థను కూడా మారుస్తారు. దీని వలన అర్హత ఉన్న ఏ ఓటరుకు ఓటు హక్కు నిరాకరించబడదు. 2029లో బ్రిటన్ లో సార్వత్రి ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికలలో లేబర్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇది ఒక ప్రధాన వాగ్దానం. బ్రిటిష్ ఉప ప్రధాన మంత్రి ఏంజెలా రేనర్ మాట్లాడుతూ, 'చాలా కాలంగా, మన ప్రజాస్వామ్యం .. మన సంస్థలపై ప్రజల విశ్వాసం క్షీణిస్తోందని అన్నారు. ఓటింగ్ వయోపరిమితిని తగ్గించే ప్రణాళికను వివరంగా వివరించే వ్యూహాత్మక పత్రాన్ని ఆమె విడుదల చేశారు.



## ఉగ్రవాదం పై భారత్ అమెరికా ఉక్కుపాదం

**టీపీఎన్, అమెరికా :**
ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF) ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంపై అమెరికా నిర్ణయాన్ని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శుక్రవారం స్వాగతించారు. ఈ చర్యను భారత దేశంఅమెరికా ఉగ్రవాద వ్యతిరేక సహకారానికి బలమైన నిదర్శనంగా అభివర్ణించారు. TRF పై చర్య తీసుకున్నందుకు అమెరికా కార్యదర్శి మార్కో రూబియోకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిషేధిత లష్కరే తోయిబా ప్రతినిధి అయిన టిఆర్ఎఫ్, ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు అమెరికా, భారత్ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఇటీవలి సంవత్సరాలలో కాశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన దాడి పహల్గామ్ దాడి. అమెరికా నిర్ణయం సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బలమైన సందేశంగా పరిగణించబడుతుంది.

## ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన AK-203 రైఫిల్

**టీపీఎన్, భారత్/రష్యా :**
భారత దేశ రక్షణ స్వాలంబనకు పెద్ద అడుగు పడింది. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన మేడ్ ఇన్ ఇండియా రైఫిల్ ను తయారు చేస్తోంది. భారత సైన్యానికి 48 వేల AK203 తుపాకులు అందాయి. 2030 నాటికి 6 లక్షల రైఫిల్స్ లక్ష్యంగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. 'షేర్' అని పిలువబడే ఈ రైఫిల్ సైన్యాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ మార్కెట్‌లో భారతదేశ జెండాను ఎగురవేస్తుంది.ఇండోరష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (IRRPL) ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో 'మేడ్ ఇన్ ఇండియా' AK203 రైఫిల్‌స్‌ను తయారు చేస్తోంది. గత 18 నెలల్లో 48000 రైఫిల్‌స్‌ను భారత సైన్యానికి అప్పగించారు. 2025 ఆగస్టు 15 నాటికి మరో 7000 రైఫిల్‌స్‌ను అందజేయనున్నారు. ప్రతి నెలా 12000 రైఫిల్స్ తయారవుతాయి. అంటే ప్రతి 100 సెకన్లకు ఒక రైఫిల్.





ఏటా సుమారు 1.5 లక్షల రైఫిల్స్ ఉత్పత్తి చేయబడతాయి.

**AK-203 యొక్క లక్షణాలు**
AK203 7.62×39mm బుల్లెట్లను కాల్చగలదు. ఇది నిమిషానికి 700 రౌండ్లు కాల్చగలదు. 800 మీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. ఈ రైఫిల్ తేలికైనది, మన్నికైనది కూడా. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా పనిచేస్తుంది. మొదటి రైఫిల్‌ను 2023 ఆగస్టు 15న కోర్వా ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు.



## పీవోకేలో మసూద్ అజార్.. నిఘా వర్గాల వెల్లడి..!

**టీపీఎన్, పీవోకే :** మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైష్ఎమొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని గిల్గిట్‌బాల్టిస్తాన్ ప్రాంతంలో కనిపించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. మసూద్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కన్పించినట్లు తెలిపాయి. బహవల్పూర్ బలమైన కోట నుంచి 1000 కిలోమీటర్ల కంటే ఎక్కువదూరంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ నేత బిలావల్ భుట్టో ఇటీవల మసూద్ గురించి చేసిన వ్యాఖ్యల్లో.. అతను ఆఫ్ఘనిస్థాన్ లో ఉండి ఉంటాడని అన్నారు. ఒకవేళ అతను పాక్ గడ్డపై దొరికితే భారత్ కు అప్పగిస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు.అతను ఇటీవల స్కార్డులో.. ముఖ్యంగా సద్పారా రోడ్ ప్రాంతం చుట్టూ కనిపించినట్లు నిఘా వర్గాలు చెప్తున్నాయి. ఆ ప్రాంతంలో రెండు మసీదులు, అనుబంధ మదర్సాలు, అనేక ప్రభుత్వ, ప్రైవేట్ గెస్ట్ హౌస్ లు ఉన్నాయి. 2016 పఠాన్ కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019లో పుల్వామాదాడిలో 40 మంది సైనికులను బలిగొనడం వెనుక మసూద్ అజార్ హస్తం ఉంది. ఈ దాడులకు ఆయనే ప్రధాన సూత్రధారి.

## థాయ్‌లాండ్‌లో హనీ ట్రాప్ కలకలం.. బౌద్ధ సన్యాసుల నుంచి రూ.100 కోట్ల దోపిడీ..!

**టీపీఎన్, థాయ్‌లాండ్ :**
థాయ్‌లాండ్‌లో బౌద్ధ మతాధికారులను హనీ ట్రాప్ కుదిపేస్తోంది. విలావన్ ఎమ్సావత్ అనే యువతి బౌద్ధ సన్యాసులను ప్రలోభపెట్టి రూ.100 కోట్లకు పైగా దోపిడీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సెక్స్, బ్లాక్‌మెయిల్, నమ్మకద్రోహం వంటి అంశాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ హనీ ట్రాప్ థాయ్‌లాండ్ బౌద్ధ ఆచారాలను కలవరపెడుతోంది.విలావన్ విసిరిన వలలో తొమ్మిది మందికి పైగా సన్యాసులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. 80,000 ఫొటోలు, ప్రైవేట్ వీడియోలతో గత మూడేళ్లుగా బెదిరించి, సన్యాసుల నుంచి రూ.100 కోట్లకు పైగా సొమ్ము సమర్పించుకున్నట్లు సమాచారం. ఈ మహిళను థాయ్ పోలీసులు 'మిస్ గోల్ఫ్' అని పిలిచారు. జూన్‌లో ఒక బాధిత సన్యాసి సన్యాసం నుంచి తప్పుకోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఈ లైంగిక బ్లాక్‌మెయిల్ వ్యవహారం బయట పడింది.2024 మేలో విలావన్ ఒక సన్యాసితో లైంగిక సంబంధం ఏర్పరచుకొని, ఆ బంధం వల్ల బిడ్డకు జన్మనిచ్చానని చెప్పి, ఖర్చుల కోసం 7 మిలియన్ బాట్ (రూ.1.85 కోట్లు) డిమాండ్ చేసింది. ఇదే తరహాలో మరికొందరు సన్యాసులను బెదిరించి భారీ మొత్తాలు స్వాహా చేసినట్లు పోలీసులు గుర్తించారు.
బ్యాంకాక్‌లో థాయ్‌లాండ్ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో, విలావన్ మూడేళ్లలో 385 మిలియన్ బాట్ (సుమారు రూ.101 కోట్లు) మనీలాండరింగ్ చేసినట్లు వెల్లడించారు. ఆమెను బ్యాంకాక్ ఉత్తర ప్రాంతంలో అరెస్టు చేశారు. ఈ సొమ్ములో కొంత ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.



ఈ డబ్బులో ఎక్కువ భాగం ఆలయ ఖజానా నుంచి వచ్చినట్లు పరిశోధకులు అనుమానిస్తున్నారు. విలావన్ ప్రలోభపెట్టిన సీనియర్ సన్యాసులలో కొందరు మఠాధిపతి హోదా కలిగినవారని సమాచారం. డిజిటల్ ఫోరెన్సిక్ నివేదికలు, ఆమె హార్డ్ డిస్క్‌లలో నిల్వ చేసిన వేలాది ఫొటోలు, మెసేజ్‌లు, వీడియోలను పరిశీలిస్తే బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. థాయ్‌లాండ్ ప్రభుత్వం ఈ హనీ ట్రాప్‌పై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. తాత్కాలిక ప్రధానమంత్రి ఫుమ్తామ్ వెచాయాచాయ్, ఆలయ ఆర్థిక వ్యవహారాలను సమీక్షించాలని, సన్యాసుల ప్రవర్తనను నియంత్రించేందుకు కఠిన నియమాలు ప్రవేశపెట్టాలని కోరారు. మతాధికారుల అనైతిక ప్రవర్తనను నివేదించడానికి ప్రత్యేక పబ్లిక్ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు.ఈ వ్యవహారం థాయ్ ప్రజలను మానసిక క్షోభకు గురిచేసిందని, సన్యాసులు అనుచితంగా ప్రవర్తించారని థాయ్ రాజు మహా వజిరలాంగ్‌కార్న్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 73వ పుట్టినరోజు వేడుకలకు ఆహ్వానించిన 80 మందికి పైగా సన్యాసుల ఆహ్వానాలను రద్దు చేశారు. 11 మంది సన్యాసులను తొలగించినప్పటికీ, బౌద్ధమత జాతీయ కార్యాలయం ఈ లైంగిక వ్యవహారంపై విస్తృత దర్యాప్తుతో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేం



## డొనాల్డ్ ట్రంప్‌కు అరుదైన వ్యాధి..!

**టీపీఎన్, వైట్‌హౌస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దీర్ఘకాల సిరల వ్యాధి (వీనస్ ఇన్‌సఫిషియెన్సీ) ఉన్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. ఇది సాధారణ రక్తప్రసరణ సమస్య అని, 70 ఏళ్లు దాటిన వారిలో సర్వసాధారణంగా కనిపించే వ్యాధి అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని, భయపడాల్సిన అవసరం లేదని మీడియాకు వెల్లడించారు.గత కొన్ని రోజులుగా ట్రంప్ కాళ్ల దిగువ భాగంలో, చీలమండ వద్ద తేలికపాటి వాపు గమనించారు. వైద్యులు పరీక్షించగా, ఇది 70 ఏళ్లు దాటిన వారిలో సాధారణంగా కనిపించే సిరల లోపమని తేలింది. ఇది ఆందోళనకరమైన పరిస్థితి కాదని వైద్యులు స్పష్టం చేశారు. ఇది డీప్ వీన్ థ్రోంబోసిస్ (రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం) లేదా ఆర్టీరియల్ వ్యాధి (ధమనులు మూసుకుపోవడం) వంటివి కాదని, గుండె లేదా కిడ్నీ వైఫల్యం వంటి సమస్యలు కూడా లేవని లీవిట్ తెలిపారు.ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి అసౌకర్యానికి గురవడం లేదని లీవిట్ పేర్కొన్నారు. అధ్యక్షుడి ఆరోగ్యం పట్ల పారదర్శకత కోసం ఈ విషయాన్ని మీడియాతో పంచుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ట్రంప్ చేతి వెనక భాగంలో కనిపించిన గాయాల గురించి కూడా లీవిట్ స్పందించారు. అవి తరచూ కరచాలనం చేయడం, ఆస్పిరిన్ వాడకం వల్ల వచ్చినవని వివరించారు.ప్రస్తుతానికి చికిత్స వివరాలను వెల్లడించలేదు, కానీ అధ్యక్షుడి వైద్య బృందం ఈ సమస్యపై దృష్టి సారించినట్లు తెలిపారు.



# 25000 దిగువకు నిఫ్టీ

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం రక్తమోడాయి. బెంచ్‌మార్క్ సహా సెక్టోరస్ సూచీలు విలవిల్లాడాయి. భారీ నష్టాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, విదేశీ సంస్థాగత మదుపరులు పెట్టుబడులు ఉపసంహరించడం, స్థానిక మదుపరులు లాభాలు స్వీకరిస్తుండటం, అమెరికాతో ట్రేడ్‌డీల్‌పై స్పష్టత రాకపోవడమే ఇందుకు కారణాలు. వీటికి తోడు కంపెనీల క్యూ1 ఫలితాలూ ఆశాజనకంగా లేకపోవడం గమనార్హం. మీడియం టర్మ్‌లో బుల్లిష్‌నెస్ ఉన్నప్పటికీ షార్ట్‌టర్మ్‌లో బేరిష్‌నెస్ కనిపిస్తోంది. నేడు డిఫెన్స్ షేర్లు విపరీతంగా నష్టపోయాయి. మొత్తంగా నిఫ్టీ 143, సెన్సెక్స్ 501 పాయింట్ల మేర నష్టపోయాయి.

క్రితం సెషన్లో 82,259 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 82,259 వద్ద మొదలైంది. 81,608 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,334 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 501 పాయింట్ల నష్టంతో 81,757 వద్ద ముగిసింది. 25,108 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,918 వద్ద కనిష్ఠ, 25,144 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 143 పాయింట్ల పతనంతో 24,968 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 545 పాయింట్ల నష్టంతో 56,283 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 15 కంపెనీలు లాభపడగా 35 నష్టపోయాయి. విప్రో, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఓఎన్జీసీ, నెస్లే ఇండియా టాప్ గెయినర్స్. యాక్సిస్ బ్యాంకు, శ్రీరామ్ ఫైనాన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్సీ లైఫ్, భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా నష్టపోయాయి. నేడు మీడియా, మెటల్ సూచీలు ఎగిశాయి. ఐటీ సూచీ ఫ్లాటుగా ముగిసింది. ప్రైవేటు బ్యాంకు, బ్యాంకు, కన్జూమర్ డ్యురబుల్స్, ఫైనాన్స్, పీఎస్ఈ, పీఎస్‌యూ బ్యాంకు, హెల్త్‌కేర్, ఆటో, ఫార్మా, చమురు రంగాల సూచీలు విలవిల్లాడాయి.

ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ సెల్లర్లకే అనుకూలంగా ఉంది. మొత్తం 3038 స్టాక్స్ ట్రేడవ్వగా 1134 లాభపడ్డాయి. 1820 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 69 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 19 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 66, లోయర్ సర్క్యూటును 33 చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడి 86.15 వద్ద స్థిరపడింది. రూ.2100 టార్గెట్ ధరతో టాటా కమ్యూనికేషన్స్‌కు సీఎల్ఎస్ఏ ఔట్ పర్ఫామ్ రేటింగ్ ఇచ్చింది. రూ.6530 టార్గెట్ ధరతో హెచ్‌డీఎఫ్సీ ఏఎంసీకి నువామా బయ్ రేటింగ్ ఇచ్చింది. యాక్సిస్ బ్యాంకు టార్గెట్ ధరను రూ.1180కి తగ్గిస్తూ రేటింగును నువామా హోల్డ్‌కు తగ్గించింది. డిఫెన్స్ మినిస్ట్రీ నుంచి బీఈఎంఎల్ రూ.185 కోట్ల విలువైన ఆర్డర్ పొందింది. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ టార్గెట్ ధరను రూ.6000కు పెంచుతూ హెచ్ఎస్‌బీసీ బయ్ రేటింగ్ కొనసాగించింది. రూ.7700 టార్గెట్ ధరతో పాలీక్యాబ్ ఇండియాకు సిటీ బయ్ రేటింగ్ కొనసాగించింది. బాండ్ల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించేందుకు సౌతిండియన్ బ్యాంకు ఆమోదం తెలిపింది. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1250 కోట్లు సమీకరించేందుకు ఐనాక్స్ విండ్ ఆమోదం తెలిపింది. రూట్ మొబైల్ క్యూ1 కన్సాలిడేటెడ్ లాభం 27% తగ్గింది. హెచ్‌డీఎఫ్సీ, ఐసీఐసీఐ, యూనియన్, ఆర్బీఎల్, యస్ బ్యాంకులు శనివారం క్యూ1 ఫలితాలు విడుదల చేయనున్నాయి.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**





# ఎఫ్ఎంసీజీ వ్యాపారం నుంచి నిష్క్రమించిన అదానీ గ్రూప్

**టీపీఎన్, ముంబై :**

ఎఫ్ఎంసీజీ జాయింట్ వెంచర్ ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (గతంలో అదానీ విల్మర్ లిమిటెడ్) నుంచి అదానీ గ్రూప్ పూర్తిగా నిష్క్రమించింది. ఇందులో భాగంగా అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ వద్ద ఉన్న 30.42% వాటాను రూ.10,874 కోట్లకు విక్రయించింది. ఇందులో 20% వాటాను సింగపూర్‌కు చెందిన విల్మర్ ఇంటర్నేషనల్ సబ్సిడియరీ లెన్స్ పీటీఈ లిమిటెడ్‌కు ఒక్కో షేరుకు రూ.275 చొప్పున రూ.7,150 కోట్లకు, మిగిలిన 10.42% వాటా రూ.3,733 కోట్లకు ఎంపిక చేసిన ఇన్వెస్టర్లకు అమ్మేసింది. ఈ ఒప్పందం ద్వారా విల్మర్ ఇంటర్నేషనల్ ఏడబ్ల్యూఎల్‌లో 63.94% వాటాతో మెజారిటీ షేర్‌హోల్డర్‌గా మారింది. 2025, జనవరిలో అదానీ ఆఫర ఫర్ సేల్ రూపంలో 13.5% వాటా విక్రయించి రూ.4,855 కోట్లను సమీకరించిన సంగతి తెలిసిందే. ఇలా మొత్తంగా మొత్తంగా రూ.15,729 కోట్ల నగదు సమీకరణను సాధించింది.

1999లో స్థాపించిన ఈ జాయింట్ వెంచర్ ఫార్చ్యూన్ బ్రాండ్‌తో ఎడిబుల్ ఆయిల్, గోధుమ పిండి, బియ్యం, చక్కెరను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం వచ్చిన నిధులను ఎయిర్‌పోర్ట్స్, గ్రీన్ హైడ్రోజన్, రోడ్లు, కాపర్ వంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో పెట్టుబడుల కోసం అదానీ గ్రూప్ ఉపయోగించనుంది. ఈ లావాదేవీ ద్వారా అదానీ ఎఫ్ఎంసీజీ రంగం నుంచి పూర్తిగా నిష్క్రమించి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి సారించనుంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు!

**టీపీఎన్, ముంబై :**

వేల సంవత్సరాలుగా తన వన్నె తగ్గని, ఎప్పటికీ ఫేడ్ అవుట్ కాని ఖనిజం బంగారమని చెప్పాలి. రోజురోజుకూ బంగారం డిమాండ్ పెరుగుతూ, ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. జనం బంగారాన్ని నగల రూపంలోనే కాకుండా భవిష్యత్ పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర లక్ష రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

**బంగారం ధరలు**

హైదరాబాద్‌లో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,330, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,050, 18 క్యారెట్ల బంగారం ధర రూ.74,500 వద్ద ట్రేడ్ అయింది. నిన్నటితో పోలిస్తే, నేడు 10 గ్రాముల బంగారం ధరలో గ్రాముకు ఒక రూపాయి చొప్పున, మొత్తం 10 రూపాయలు పెరిగింది. శుక్రవారం ధరలు ఇలా ఉన్నాయి:

- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం: రూ.99,340
- 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం: రూ.91,060
- 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం: రూ.74,510

**వెండి ధరలు**

బంగారం ధరలతో సంబంధం లేకుండా, వెండి ధరలు రోజురోజుకూ కొంత తగ్గుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో 100 గ్రాముల వెండి ధర రూ.12,400, కేజీ వెండి ధర రూ.1,24,000 వద్ద ట్రేడ్ అయింది. 100 గ్రాముల వెండిపై రూ.10, కేజీ వెండిపై రూ.100 తగ్గింది. నేటి ధరలు ఇలా ఉన్నాయి:

-100 గ్రాముల వెండి: రూ.12,390
-కేజీ వెండి: రూ.1,23,900



# కెల్వినేటర్‌ను సొంతం చేసుకున్న రిలయన్స్ రిటైల్

**టీపీఎన్, ముంబై :**

హోమ్ అప్లయన్సెస్ బ్రాండ్ కెల్వినేటర్‌ను సొంతం చేసుకున్నట్లు రిలయన్స్ రిటైల్ శుక్రవారం ప్రకటించింది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కన్స్యూమర్ డ్యూరబుల్స్ మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడనుంది. 1970, 80 దశకాల్లో హోమ్ రిఫ్రిజిరేషన్ పరిశ్రమలో "ది కూలెస్ట్ వన్" ట్యాగ్‌లైన్‌తో కెల్వినేటర్ ప్రసిద్ధి పొందిన సంగతి తెలిసిందే. రిలయన్స్ ఉత్పాదక పోర్ట్‌ఫోలియోకు ఇది బలమైన బ్రాండ్ విలువను జోడిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

"భారతీయ వినియోగదారులకు విశ్వసనీయ ప్రపంచ ఆవిష్కరణలను అందించాలనే మా లక్ష్యంలో ఇది మరో ముఖ్యమైన అడుగు. భారతీయ గృహాలకు అధిక నాణ్యత గల, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన అప్లయన్స్‌లను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం" అని రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ అన్నారు. తమ విస్తృత నెట్‌వర్క్ ఇందుకు దోహద పడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా రిలయన్స్ రిటైల్ ప్రీమియం హోమ్ అప్లయన్సెస్ విభాగంలో లోతుగా చొచ్చుకుపోవాలని, కస్టమర్లకు మరిన్ని ఆప్షన్లు అందించాలని, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగంలో వృద్ధిని వేగవంతం చేయాలని కంపెనీ యోచిస్తోంది.

**జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రాఫిట్ రూ.2184 కోట్లు**

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ Q1 FY26లో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ఏకీకృత నికర లాభం 158% YoY పెరిగి రూ. 2,184 కోట్లకు చేరింది. గత ఏడాది రూ. 845 కోట్ల నుంచి 45% QoQ వృద్ధి కనిపించింది. ఆదాయం 11% YoY పెరిగి రూ. 44,588 కోట్లకు చేరగా, Q4 FY25లో రూ. 46,269 కోట్ల నుంచి 4% తగ్గింది. EBITDA రూ. 7,576 కోట్ల వద్ద 17.6% మార్జిన్‌ను సాధించింది. ఆపరేషనల్ కాస్ట్ తగ్గించుకోవడం, సామర్థ్యం జోడింపు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ఖర్చులను తగ్గించుకోవడంపై దృష్టి సారించడం వల్ల మార్కెట్‌లో బలమైన స్థానాన్ని సాధించింది.

**హిందుస్థాన్ జింక్**

FY26 Q1లో హిందుస్థాన్ జింక్ నికర లాభం 4.75% తగ్గి రూ. 2,234 కోట్లకు చేరింది. గత సంవత్సరం ఇది రూ. 2,345 కోట్లుగా ఉంది. ఆదాయం 3.8% తగ్గి రూ. 7,591 కోట్లకు పడిపోయింది. ఉత్పత్తి స్థాయుల్లో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. మైన్డ్ మెటల్ ఉత్పత్తి 1% పెరిగి 265 కిలో టన్నులకు చేరగా రిఫైన్డ్ మెటల్ 5% తగ్గింది. వెండి ఉత్పత్తి 11% తగ్గి 149 టన్నులకు చేరింది.

**ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**

నికర లాభం: రూ. 1,111 కోట్లు (76% YoY పెరుగుదల, గత ఏడాది రూ. 633 కోట్లు).
ఆదాయం : రూ. 8,866 కోట్లు (17% YoY పెరుగుదల, గత ఏడాది రూ. 7,568 కోట్లు).
ఆపరేటింగ్ లాభం రూ. 2,358 కోట్లు (గత ఏడాది రూ. 1,676 కోట్లు)
గ్రాస్ NPA 1.97%కి తగ్గింది (గత ఏడాది 2.89%), నెట్ NPA 0.32% (గత ఏడాది 0.51%).

**ఎల్ అండ్ టీ ఫైనాన్స్**

నికర లాభం: రూ. 681 కోట్లు (అంచనా, గత ఏడాది డేటా అందుబాటులో లేదు).
ఆదాయం: రూ. 2,457 కోట్లు (అంచనా).

**బంధన్ బ్యాంక్**

నికర లాభం: రూ. 371.96 కోట్లు (65% YoY తగ్గుదల, గత ఏడాది రూ. 1,063.46 కోట్లు).
ఆదాయం: రూ. 2,805.1 కోట్లు (నెట్ ఇంటరెస్ట్ ఇన్‌కం, 12.6% YoY పెరుగుదల).
ఆపరేటింగ్ ప్రాఫిట్: రూ. 1,941 కోట్లు (24% YoY పెరుగుదల).




# కష్టమైనా.. వైద్యం అందాలనే పట్టుదల


కూలికి వెళితే గానీ పూట గడవని పరిస్థితి. అయినా డాక్టర్ కావాలని కలలుకంది బిహార్‌కి చెందిన తబస్సుమ్ జహాన్. ఇందుకు చిన్నప్పుడు తనకెదురైన పరిస్థితులే కారణమంటోంది. తాను కోరుకున్నట్టుగానే రీసెంట్ గా రిలీజ్ అయిన నీట్ యూజీ ఎగ్జామ్స్ లో 550 మార్కులు తెచ్చుకుని డాక్టర్ సీటు సంపాదించుకుంది. కటికపేదరికం నుంచి వైద్య విద్య అభ్యసించే వరకూ సాగిన తన ప్రయాణం నెట్టింట్లో వైరల్ అవుతోంది. తన కష్టం, ఇష్టం ఆమె మాటల్లోనే విందాం. రోజు గడవాలంటే ఇంటిల్లిపాదీ కష్టపడాల్సిందే. అందుకే నేను ఓ ఇంట్లో హెల్పర్‌గా పనిచేసేదాన్ని ఓ రోజు సామాన్లు సర్దుతుండగా కిందపడి చేతికి గాయం అయ్యింది. దాంతో మోచేతి లోని నరం కుంచించుకుపోయింది. చికిత్స కోసం అమ్మ పట్నాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రి బిల్లు కట్టడానికీ డబ్బుల్లేవు. అతికష్టం మీద రూమ్ అద్దె, మందుల ఖర్చులు చెల్లించేది అమ్మ. ఏడు నెలలు అయినా నా పరిస్థితిలో మార్పు రాలేదు. దాంతో ఉత్తర్‌ప్రదేశ్ లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే నయం అవుతుందని తెలిసిన వారు చెప్పారు. కానీ, అంత ఆర్థికస్థోమత లేదు మాకు. అయినా అమ్మ వెనకడుగు వేయలేదు. డబ్బుల కోసం నన్ను ఆసుపత్రిలో ఉంచి బట్టలు కుట్టడానికి వెళ్లేది. ఆమె రేయింబవళ్లు కష్టపడినా ఆ మొత్తం నా మందులకే సరిపోయేవి. తెలిసినవాళ్లని అప్పు అడిగితే, డబ్బులు ఇవ్వకపోగా మా పేదరికాన్నీ, అమ్మనూ చులకన చేసి మాట్లాడేవారు. ఆ సమయంలో నా చెయ్యి నొప్పికన్నా... వాళ్లు అమ్మను అన్న మాటలే నన్ను ఎంతగానో బాధించాయి అంటూ తబస్సుమ్ చెప్పుకొచ్చింది. ఆ తర్వాత వాళ్లున్న ఆసుపత్రి రూమ్ ఫీజు కట్టలేకపోవడంతో వాళ్లని హాస్పిటల్ నుంచి బయటికి పంపేశారు. చేసేదిలేక తల్లీకూతుళ్లిద్దరూ మూడు రోజుల పాటు గోరఖ్ పుర్ రైల్వేస్టేషనులోనే గడిపారు. అప్పుడే తబస్సుమ్ నిర్ణయించుకుందట వైద్యం కోసం తను పడిన కష్టం ఇంకెవరూ పడకూడదని. అనారోగ్య కారణాల వల్ల ఏడాదిన్నర చదువుకి దూరమైనా తబస్సుమ్ తన చదువును కంటిన్యూ చేయాలనుకుంది. డాక్టర్ కావాలన్న ఆమె ఆశయానికి ఫిజిక్స్ వాలా విద్యాపీఠ్ సంస్థ తోడైంది. మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ఆఫ్‌లైన్ ద్వారా ప్రశ్నా పత్రాలు, మాడ్యూల్స్ ఇస్తుంటుందీ సంస్థ. వీటి సహాయంతో నీట్ యూజీ 2025 పరీక్షలో అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించింది తబస్సుమ్. అంతేకాదు, ఫ్రీ సీటు కూడా సంపాదించుకుంది. దీంతో పీడబ్ల్యూ వ్యవస్థాపకుడు అలఖ్ తన పైచదువుకి ఉపయోగపడేలా రూ.4లక్షల స్కాలర్ షిప్, ల్యాప్‌టాప్ ను అందించారు. అమ్మాయి ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడకూడదు. తన కాళ్లమీద తనే నిలబడాలి. డబ్బు పుస్తకాలను కొనుక్కోవడానికి పనికొస్తుంది. కానీ, జ్ఞానాన్ని కాదు. అది పొందాలంటే మన ప్రయత్నంతోనే సాధ్యం అవుతుంది. ముఖ్యంగా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి అనుకున్నప్పుడు ప్రతి ఒక్కరూ సొంతంగా, కొత్తగా ప్రయత్నించాలి అనే తబస్సుమ్ ఆలోచన ఇప్పుడు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఇంటర్, టెన్త్ లోనే మార్కులు తక్కువ వచ్చాయనో.. ఇంట్లో వాళ్లు ఆర్థికంగా స్థిరంగా లేరనే కారణమో.. చదువులో చిన్నపాటి ఒత్తిడికే ఆత్మహత్యలు చేసుకుంటున్న ఎంతోమందికి యువతకు తబస్సుమ్ ఎన్ని కష్టాలు ఎదురైనా అనుకున్నది సాధించడం కోసం పడిన కష్టం ఆదర్శంగా నిలుస్తుందని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# పుట్టగొడుగుల వల్ల లాభాలు తెలుసా?



మారుతున్న జీవనశైలి వల్ల ప్రజలు అనేక సమస్యల బారిన పడుతున్నారు. రక్తపోటు, థైరాయిడ్, మధుమేహం వంటి సమస్యలు నేటి కాలంలో చాలా కామన్ గా మారిపోయాయి. డయాబెటిక్ రోగులకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే ఆహారాన్ని తినకూడదని వైద్యులు సూచిస్తున్నారు. దీనివల్ల మధుమేహం సమస్య పెరుగుతుంది. అందుకే చాలా మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహార పదార్థాల విషయంలో అయోమయంలో ఉంటారు. ఎలాంటి ఆహారం ఎంచుకోవాలో అర్థం కాదు. డయాబెటిక్ రోగులు వారి ఆహారంలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాన్ని చేర్చుకోవాలి. ఇటువంటి ఆహారాలు రక్తంలో చక్కెరను కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తాయి. అయితే డయాబెటిక్ పేషెంట్స్ కి పుట్టగొడుగుల వినియోగం సరైనదా కాదా అనేది ఇప్పుడు తెలుసుకుందాం. డయాబెటిస్ ను పూర్తిగా నివారించడానికి, లేదా కంట్రోల్ చేయడానికి పుట్టగొడుగులు బెస్ట్ ఫుడ్స్ లో ఒకటి. పుట్టగొడుగులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధుమేహాన్ని నివారించవచ్చు. బరువు నియంత్రణ, జీర్ణక్రియ, గుండె సమస్యలతో సహా అనేక ఆరోగ్య పరిస్థితులకు పుట్టగొడుగులు మాత్రమే పరిష్కారం. పుట్టగొడుగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆరోగ్యకరమైన శరీరానికి మేలు చేసే ఇలాంటి అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డయాబెటిక్ రోగులకు పుట్టగొడుగులు ప్రయోజనకరంగా ఉంటాయి. పుట్టగొడుగులు స్టార్చ్ లేనివి, ఇది రక్తంలో చక్కెర రోగులకు మంచిది. ఇది కాకుండా, ఫైబర్ ఇందులో కరుగుతుంది. ఇది మధుమేహ రోగులకు చాలా మంచిది. పుట్టగొడుగులు వాటి గొప్ప పోషకాహారం కారణంగా చాలా ఆరోగ్యకరమైనవి. పుట్టగొడుగులలో 90% నీరు ఉంటుంది, ఇది బరువు తగ్గడానికి, కేలరీల నియంత్రణకు గొప్పది. ఇంకా, పుట్టగొడుగులు తక్కువ కొవ్వు, అధిక ప్రోటీన్, పోషకాలు అధికంగా ఉండే ఆహారం. పుట్టగొడుగులు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ని కలిగి ఉంటాయి. అంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. మధుమేహం కోసం ఆహారాన్ని ప్లాన్ చేస్తున్నప్పుడు, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఫుడ్స్ ని సూచిస్తారు. ఎందుకంటే కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెరకు చెడ్డవి. పుట్టగొడుగులను తింటే పొట్ట ఎక్కువసేపు నిండుగా ఉంటుంది. మీరు డయాబెటిక్ అయితే, మీకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పుట్టగొడుగులలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు తక్కువగా ఉండటం వల్ల గుండెకు మేలు చేస్తుంది. ఇది శరీరంలో కొవ్వు పేరుకుపోవడాన్ని అనుమతించదు, ఇది చివరికి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అదనంగా, పుట్టగొడుగులు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉన్నాయని చెబుతారు. పుట్టగొడుగులు రక్తంలో చక్కెరను బాగా గ్రహించేలా చేస్తాయి, ఇది ఇన్సులిన్ నిరోధకతను కలుపుతుంది. మీ రోజువారీ ఆహారంలో పుట్టగొడుగులను చేర్చుకోవడం వల్ల మధుమేహం లేని వారిలో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చు. ఒబెసిటీ, షుగర్ కు ఇంటర్ లింక్ కలిగి ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు బరువు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల షుగర్ కంట్రోల్ అనేది చాలా ముఖ్యం. పుట్టగొడుగులలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి కానీ ప్రోటీన్ అండ్ ఫైబర్ అధికంగా ఉంటాయి. పుట్టగొడుగులను తినడం వల్ల రోజంతా మీ శక్తి స్థాయిలను పెంచుకోవచ్చు. జీవక్రియ సమస్యలను తగ్గిస్తుంది. పుట్టగొడుగులు జీవక్రియ రుగ్మతలు, అధిక రక్తపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఇది అదనపు కొవ్వును కాల్చడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. పుట్టగొడుగుల వినియోగం మధుమేహంతో సంబంధం ఉన్న అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమరహిత రక్తంలో చక్కెర స్థాయిలు సమస్యాత్మకంగా ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటానికి సరైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. చివరగా మధుమేహాన్ని క్రమం తప్పకుండా కంట్రోల్ లో ఉంచుకోవడం అవసరం.

# కళ్లు మండుతున్నాయా?



కళ్లు మంటగా అనిపించడం, ఎర్రగా మారడం, మసకబారడం, ఉబ్బడం, కన్నీళ్లు రాకపోవడం.. ఇవన్నీ కళ్లు పొడిబారుతున్నాయని తెలిపే లక్షణాలు. ఈ సమస్యను స్టార్టింగ్ లోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే దీర్ఘకాలంలో మరిన్ని కంటి సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కళ్లు పొడిబారడానికి చాలా రీజన్స్ ఉంటాయి. విటమిన్‌ఏ లోపించడం, హార్మోన్ల ఇంబ్యాలెన్స్, థైరాయిడ్, కంప్యూటర్లు, మొబైల్స్ అండ్ టీవీ ముందు ఎక్కువసేపు గడపడం, వివిధ రకాల ఎలర్జీలు, వృద్ధాప్యం, దుమ్ము, ధూళి ఇలాంటి కారణాల వల్ల కళ్లు పొడిబారతాయి. ఇక కంటి ఆరోగ్యంలో లాక్రిమల్ గ్రంథిది మెయిన్ రోల్. దీని నుంచి ఉత్పత్తయ్యే ద్రవాలే ఎప్పటికప్పుడు కళ్లను శుభ్రపరచి కాపాడుతుంటాయి. అయితే పొడి కళ్ల కారణంగా కంటి ఉపరితలం డీహైడ్రేటెడ్‌గా మారుతుంది. చికాకు, దురద వంటివి ఇబ్బంది పెడతాయి. ఇక చాలామంది కళ్లకు వేసుకునే మేకప్ ను క్లియర్ చేసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తారు. ఇది కూడా కళ్లు పొడిబారడానికి కారణమవుతుంది. కంప్యూటర్లు, మొబైల్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు చాలామంది కనురెప్ప వేయకుండా కళ్లు పెద్దవి చేసి మరీ స్క్రీన్ వైపు చూస్తుంటారు. ఇలా చేయడం వల్ల కళ్లు పొడిబారి, బాగా మంట పెడతాయి. అందుకే వీటికి సాధ్యమైనంత దూరంగా ఉంటూనే.. ఉపయోగిస్తున్నప్పుడూ తరచుగా రెప్పలు వాల్చుతూ ఉండాలి. ల్యాప్‌టాప్స్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మధ్య మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకోవాలి. మరీ చల్లని నీరు లేదా వేడి నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో కళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. కళ్లలోని లాక్రిమల్ గ్రంథులు సమర్థంగా పనిచేయాలంటే ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగాలి. అదేవిధంగా నీటి శాతం ఎక్కువగా ఉండే కీరా, పుచ్చకాయ, స్ట్రాబెర్రీ.. మొదలైన పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి. పొడి కళ్ల నుంచి ఉపశమనం పొందాలంటే ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలు ఎక్కువగా తినాలి. వీటితో పాటు వాల్‌నట్స్, బాదం, అరటి పండ్లు, ఎండు ద్రాక్ష, అవకాడోలను తరచూ తీసుకోవాలి. హెయిర్ డ్రయర్స్, ఏసీలు, కూలర్లు, హీటర్ల నుంచి వచ్చే గాలులు నేరుగా కళ్లపై పడకుండా జాగ్రత్త పడాలి. కంప్యూటర్లు, మొబైల్స్ నుంచి వచ్చే నీలి కాంతి నుంచి రక్షణ పొందడానికి బ్లూ లైట్ ఫిల్టర్ గ్లాసెస్ వాడడం మంచిది. కళ్లకు మేకప్ వేసుకునే అలవాటు ఉన్న వారు తప్పనిసరిగా కనురెప్పలు, కనుబొమ్మలు, కళ్ల చుట్టు పక్కల చర్మాన్ని మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. అలాగే పడుకునే ముందు మేకప్‌ను తొలగించుకోవడం తప్పనిసరి. బయటకు వెళ్లే సమయంలో సన్‌గ్లాసెస్ ధరించడం మంచిది. దీనివల్ల దుమ్ము, ధూళి, కాలుష్యం నుంచే కాకుండా సూర్యుని నుంచి వెలువడే అతినీల కిరణాల నుంచి కళ్లను కాపాడుకోవచ్చు.

# సరికొత్త డిజైన్ తో ఫోన్ లాంచ్ చేస్తున్న వివో!




వివో కొత్త ఫోన్ లాంచ్ కోసం టీజింగ్ మొదలు పెట్టింది. అదే వివో టి4 ఆర్ స్మార్ట్ ఫోన్ అండ్ ఈ ఫోన్ ను అతి సన్నని డిజైన్ తో అందిస్తున్నట్లు వివో తెలిపింది. రీసెంట్ గా వివో ఎక్స్ 200 FE, వివో ఎక్స్ ఫోల్డ్ 5 స్మార్ట్ ఫోన్ రెండు ప్రీమియం స్మార్ట్ ఫోన్లు విడుదల చేసిన వివో ఇప్పుడు బడ్జెట్ సిరీస్ అయిన టి సిరీస్ నుంచి కొత్త ఫోన్ లాంచ్ చేస్తోంది. వివో టి4 ఆర్ స్మార్ట్ ఫోన్ ను త్వరలో లాంచ్ చేస్తున్నట్లు కమింగ్ సూన్ ట్యాగ్ తో టీజింగ్ చేస్తోంది. ఈ అప్ కమింగ్ ఫోన్ కోసం ఫ్లిప్ కార్ట్ ను సేల్ పార్ట్‌నర్ గా సెలెక్ట్ చేసుకుంది. అంతేకాకుండా ఫ్లిప్ కార్ట్ నుండి స్పెషల్ టీజర్ పేజీతో టీజింగ్ కూడా చేస్తోంది. ఈ వివో ఫోన్ యొక్క రెండు మెయిన్ ఫీచర్స్ ను టీజర్ పేజీ ద్వారా అందించింది. అదేమిటంటే, ఈ ఫోన్ ను ఇండియాలో సన్నని ఫోన్ గా లాంచ్ చేస్తున్నట్లు వివో టీజింగ్ చేస్తోంది. అంటే, ఈ ఫోన్ ఇండియాలో ఇప్పటివరకు విడుదల చేసిన క్వాడ్ కర్వ్డ్ ఫోన్స్ కంటే మరింత సన్నని డిజైన్ తో లాంచ్ చేస్తున్నట్లు వివో టీజింగ్ చెబుతోంది. ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ డిస్ప్లే గురించి కూడా వివో కన్ఫర్మ్ చేసింది. వివో టి4 ఆర్ స్మార్ట్ ఫోన్ ను క్వాడ్ కర్వ్డ్ స్క్రీన్ తో లాంచ్ చేస్తున్నట్లు వివో తెలిపింది. ఈ ఫోన్ డిజైన్ ను తెలిపే టీజర్ ఇమేజ్ కూడా వివో విడుదల చేసింది. ఇందులో పెద్ద రౌండ్ కెమెరా బంప్ ఉన్నట్లు కూడా కనిపిస్తుంది. వివో టి4 ఆర్ అంచనా ఫీచర్స్ కూడా నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ రూమర్స్ ప్రకారం, ఈ వివో ఫోన్ మీడియాటెక్ డైమెన్షన్ 7400 చిప్ సెట్ తో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ ఫోన్ 50 MP సోనీ IMX882 మెయిన్ కెమెరా కలిగిన డ్యూయల్ రియర్ కెమెరా అండ్ 32 MP సెల్ఫీ కెమెరా ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు, ఈ ఫోన్ 6500 mAh బిగ్ బ్యాటరీ తో పాటు 90W ఫాస్ట్ ఛార్జ్ సపోర్ట్ ను కూడా కలిగి ఉంటుందని ఈ రూమర్స్ చెబుతున్నాయి. మరి ఈ ఫోన్ లాంచింగ్ కోసం మొబైల్ లవర్స్ చాలా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# వైరల్.. మరీ ఇంత మర్చిపోతారా?



కొంతమందికి మతిమరుపు ఉంటుంది. చేతిలో పెన్ను పెట్టుకుని ఇల్లంతా వెతికినట్లు అన్నంతగా మతిమరుపు ఉంటుంది. మతిమరుపుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అయితే కొన్ని ఇన్సిడెంట్స్ మాత్రం నిజంగానే మతిమరుపుతో చేశారా? లేక కావాలనే నటిస్తున్నారా అర్థం కాకుండా ఉంటాయి. అలాంటి వీడియోనే ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. స్కూటీ నడుపుతున్నప్పుడు అమ్మాయిలు ఏదో ఒక తప్పు చేయడం మనకు కనిపిస్తుంది. ఇక సోషల్ మీడియా ఈ వీడియోలను వైరల్ చేస్తారు. ప్రజలు దానిని చూడటమే కాకుండా ఒకరితో ఒకరు షేర్ చేసుకుంటారు కూడా. ఇక లేటెస్ట్ గా ఇలాంటి వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. స్కూటీలో పెట్రోల్ పోసుకున్న తర్వాత ఒక అమ్మాయి చేసిన తప్పు ఇప్పుడు అందరినీ నవ్విస్తుంది. వైరల్ అవుతున్న ఈ వీడియో ఒక పెట్రోల్ బంకుకు సంబంధించినది. అక్కడ ఒక అమ్మాయి పెట్రోల్ నింపి ముందుకు వెళుతుంది. అయితే పెట్రోల్ నింపేటప్పుడు పైకి లేపిన స్కూటీ సీటును మళ్లీ సర్దకుండానే అలాగే వెళుతుంది. దీని తర్వాత వీడియో తీస్తున్న వ్యక్తి ఆమెను ఆపి ఆమె తప్పు గురించి చెబుతాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ అమ్మాయికి తన తప్పు గురించి కూడా తెలియదు. అయితే, అబ్బాయి ఆమెకు అలా చెప్పినప్పుడు, ఆమె అతనికి ఆ తప్పు చెప్పినందుకు థ్యాంక్స్ చెబుతుంది. వీడియోలో, ఒక అమ్మాయి పెట్రోల్ నింపిన తర్వాత పెట్రోల్ బంకు నుండి వెళ్తున్నట్లు మీరు చూడవచ్చు, కానీ ఇంధనం నింపడానికి తాను ఎత్తిన సీటును తగ్గించడం మర్చిపోయింది. ఒక వ్యక్తి ఈ మొత్తం వీడియోని తన కెమెరాలో రికార్డ్ చేస్తున్నాడు అంతేకాకుండా చివరికి అతను వెళ్లి తన తప్పు ఏమిటో చెబుతాడు. అప్పటి వరకు ఆ మహిళ తాను సీటు పై కూర్చోలేదని ఆ మహిళ గ్రహించదు. ఈ వీడియోను చూసిన తర్వాత వేలాది మంది దీన్ని లైక్ చేస్తూ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.

# నాలుగో టెస్టులో అతడికి దక్కనుందా?



ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో భారత్ కాస్త తడబాటుకు గురవుతుంది. మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్టులో గెలిస్తేనే సిరీస్ సొంతమయ్యేది. ఈ క్రమంలో టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్, హెడ్ కోచ్ గంభీర్ పై తీవ్ర ఒత్తిడి ఉందని అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అయితే, నాలుగో టెస్టులో విజయం సాధించేందుకు కుల్ దీప్ యాదవ్ ను రంగంలోకి దించాలని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ సూచించాడు. టీమిండియా స్క్వాడ్ లో భాగమైనప్పటికీ కుల్ దీప్ కు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఇంకా చోటు దక్కలేదు. ఇప్పటివరకూ అతడు ఇంగ్లండ్‌పై ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో కుల్‌దీప్‌ను రంగంలోకి దించాలని క్లార్క్ సూచించాడు. ఇండియా అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా జడేజా ప్రదర్శన అద్భుతం. అయితే నేనొక విషయం పబ్లిక్ గా చెప్పదలుచుకున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కుల్‌దీప్‌కు చోటివ్వాలి. అతడిని రంగంలోకి దించండి. ఎలాగోలా ఈ పని చేయండి. నిజానికి వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అవసరమైనప్పుడు రన్స్ కూడా స్కోర్ చేశాడు. ఇక జడేజా పర్‌ఫార్మెన్స్ అద్భుతం. ఎన్నో సందర్భాల్లో జట్టుకు అండగా నిలిచాడు. జట్టు విజయాల్లో కీలక రోల్ పోషించాడు. అయితే, మూడో టెస్టులో అతడికి మరో ఎండ్‌లో సపోర్ట్ గా ఎవరైనా ఉంటే బాగుండేది. అతడికీ ఇదే అనిపించి ఉంటుంది అని అన్నాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ 22 పరుగుల తేడాతో ఓటమి చవి చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్లార్క్ సూచనను గిల్, గంభీర్ స్వీకరిస్తారో లేదో తెలియాల్సి ఉంది. ఇక మాంచెస్టర్‌లో జరగనున్న నాలుగో టెస్టులో బుమ్రా అందుబాటులోకి వస్తాడా రాడా అన్న టాపిక్ పై కూడా సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ సిరీస్‌లో భారత్ గెలవాలంటే నాలుగో టెస్టులో భారత్‌కు విజయం తప్పనిసరి. అయితే, బుమ్రాను బరిలోకి దించేందుకు టీమిండియా కూడా పాజిటివ్ గా ఉన్నట్టు తెలుస్తోంది. చివరి రెండు టెస్టుల్లో ఏదోక దాంట్లో అతడిని రంగంలోకి దించుతాము. కీలకమైన నాలుగో టెస్టులోనే బుమ్రాను దింపే అవకాశం ఉంది. అయితే, ఈ విషయంపై మాంచెస్టర్‌లోనే నిర్ణయం తీసుకుంటాము అని అసిస్టెంట్ కోచ్ రియనె టెన్ డోస్కాటే తెలిపాడు.

# ప్రజ్ఞానందకు ఊహించని ఓటమి

ఫ్రీ స్టైల్ గ్రాండ్ స్లామ్.. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి విశ్వ వేదికపై మరోసారి తన సత్తా చూపించాడు. ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ లో అదరగొడుతున్న అతడు దర్జాగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. లాస్ వేగాస్ లో గ్రాండ్‌గా జరిగిన క్వార్టర్స్‌లో ఉజ్బెకిస్థాన్ స్టార్ నొద్రిబెక్ అబ్దుసత్రోవ్‌ను తెలంగాణ కుర్రాడు చిత్తు చేశాడు. అయితే వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్ సన్ ను ఓడించి రెట్టించిన ఉత్సాహంతో క్వార్టర్స్ చేరిన ప్రజ్ఞానంద మాత్రం అనూహ్యంగా టైటిల్ రేసులో వెనకబడ్డాడు. తన సూపర్ ఆటతో అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తున్న అర్జున్.. ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లోనూ మెరిశాడు. నొద్రిబెక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ 1.50.5తో విన్నర్ గా నిలిచాడు. తన అద్భుతమైన ప్లానింగ్ తో ప్రత్యర్థిని మట్టికరిపించి సెమీస్ లో అడుగుపెట్టి టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచాడు. గత మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ కు ముచ్చెమటలు పట్టించిన ప్రజ్ఞానంద సెమీస్ బెర్తు సాధించలేకపోయాడు. క్వార్టర్స్‌లో అతడు కరౌనా చేతిలో 34తో పరాజయం చెందాడు. దాంతో, టైటిల్ రేసు నుంచి వైదొలిగాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్లు లెవొన్ అరొనియన్, హన్స్ మొకే నీమన్‌లు సెమీస్‌లో బరిలో నిలిచారు. కాగా ప్రస్తుతం అర్జున్ పేరు చెస్ వరల్డ్ లో మార్మోగుతుంది.





# మరో వివాదంలో షమీ మాజీ భార్య

భారత పేసర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసిన్ జహన్ మరో వివాదంలో చిక్కుకుంది. షమీ నుంచి విడాకులు, భరణం కోరుతూ కోర్టును ఆశ్రయించిన ఆమె ఎదురింట్లో ఉండే మహిళపై దాడి చేసింది. దాంతో ఆ మహిళ జహన్ పై డలియా ఖాటూన్ పోలీసులకు కంప్లైంట్ చేసింది. తనపై దాడి చేయడమే కాకుండా కుట్ర పన్నడం, హత్యా ప్రయత్నం చేసిందని ఆమె తన కంప్లైంట్ లో తెలిపింది. ప్రస్తుతం జహన్ ఆ మహిళపై చేయి చేసుకుంటున్న వీడియో నెట్టింట వైరలవుతోంది. జహన్ కు, పొరుగుంటి మహిళకు మధ్య భూ వివాదమే ఈ గొడవలకు కారణమని తెలుస్తోంది. బెంగాల్ లోని సురీ పట్టణంలో ఉన్న ఒక స్థలం విషయంలో ఇరువురి మధ్య వివాదం నడుస్తోంది. దాంతో, తనకు చెందిన భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆ మహిళపై జహన్ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది. తర్వాత ఆ భూమిని తన కూతురు పేరుతో రిజిస్టర్ చేసి ఇంటి నిర్మాణం చేపట్టింది. అయితే.. స్థలం వివాదం కొలిక్కి రాకపోవడంతో అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని ఆమెను హెచ్చరించే ప్రయత్నం చేసింది ఆ మహిళ. ఆమె తీరుతో కోపం తెచ్చుకున్న జహన్ చేయి చేసుకుంది. మోడల్ అయిన హసిన్ జహన్‌ను షమీ 2014లో పెండ్లి చేసుకున్నాడు. మరుసటి ఏడాది ఈ జంటకు అమైరా జన్మించింది. అయితే.. 2018లో షమీపై గృహ హింస కేసు పెట్టిన జహన్.. ఆ తర్వాత విడాకులకు దరఖాస్తుచేసింది. అప్పటి నుంచి ఇద్దరూ విడిగా ఉంటున్నారు. ఆరేళ్లకు పైగా సాగుతున్న కేసులో స్పీడ్‌స్టర్‌ను భరణం చెల్లించాల్సిందిగా హైకోర్టు ఈమధ్యే ఆదేశించింది. జహన్, కూతురు ఐరా ఖర్చుల కోసం ప్రతి నెల రూ.4 లక్షలు ఇవ్వాలని కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ భరణం కింద భార్యకు రూ.1.5లక్షలు, కూతురుకు రూ.2.5లక్షలు ఇవ్వాల్సిందేనని షమీకి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ గా జడేజా!

లార్డ్స్‌లో గెలవాల్సిన మ్యాచ్‌ను భారత జట్టు చేజార్చుకుంది. మెయిన్ బ్యాటర్లు ఫెయిల్ అయిన స్టేజ్ లో సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తన అసమాన పోరాటంతో టీమ్‌ను గెలిపించేందుకు సర్వశక్తులు ప్రయత్నించాడు. టెయిలెండర్లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన అతడు ఇంగ్లండ్ వెన్నులో వణుకుపుట్టించాడు. చరిత్రలో నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడిన జడ్డూ శ్రమకు తగిన గుర్తింపు దక్కింది. ఈ వెటరన్ ప్లేయర్‌ను ఆకాశానికెత్తేసిన ప్రధాన కోచ్ గౌతం గంభీర్ మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ ట్యాగ్ ఇస్తున్నామని చెప్పాడు. లార్డ్స్ టెస్టులో ఐదోరోజు భారత టెయిలెండర్లు గొప్ప ప్రదర్శన చేశారు. ముఖ్యంగా జడేజా అద్భుత పోరాటం కనబరిచాడు. అందకే అతడు టీమిండియాకు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అని అన్నాడు. సహాయక కోచ్ రియాన్ టెన్ డస్చేట్ సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు. లార్డ్స్ మైదానంలో జడేజా బ్యాటింగ్ వేరే లెవల్‌లో సాగింది. గత రెండు మ్యాచుల్లో అతడు నిలకడగా రాణించాడు. జడ్డూ డ్రెస్సింగ్ రూమ్‌కు ప్రశాంతత తీసుకొచ్చాడు. నేను కొన్ని ఏళ్లుగా అతడిని గమనిస్తున్నా. జడేజా ఆటలో ఎంతో పరిణతి సాధించాడు. నిఖార్సైన బ్యాటర్‌గా అవతరించాడు అని డస్చేట్ చెప్పుకొచ్చాడు. అండర్సన్, టెండూల్కర్ ట్రోఫీలో ఫస్ట్ టెస్టులో కంగుతిన్న భారత జట్టు బర్మింగ్‌హామ్‌లో పంజా విసిరింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో కదం తొక్కగా.. పేసర్ ఆకాశ్ దీప్ 9 వికెట్లతో ఇంగ్లండ్ కు షాక్ ఇచ్చాడు. ఎడ్జ్ బాస్టన్ లో చరిత్రాత్మక విజయంతో సిరీస్ సమం చేసిన టీమిండియా.. లార్డ్స్‌లోనూ ప్రత్యర్థికి దడ పుట్టించింది. ఇక ఐదో రోజు మిడిలార్డర్ కూడా అదే తడబాటు కొనసాగించగా రవీంద్ర జడేజా 61 రన్స్ నాటౌట్ తో ఒంటరి సైనికుడిలా పోరాడాడు. ఏడో స్థానంలో క్రీజులోకి వచ్చిన అతడికి నితీశ్, బుమ్రా, సిరాజ్‌లు సహకరించగా విజయానికి చేరువైంది. 22 పరుగులు అవసరమైన వేళ బషీర్ బౌలింగ్‌లో చివరి బంతిని సిరాజ్ సమర్థంగా అడ్డుకున్నాడు. కానీ, బంతి బౌన్స్ అవుతూ లెగ్ సైడ్ వికెట్లను తాకింది. దీంతో ఒక్కసారిగా టీమిండియా కల చెదిరిపోయింది.






# డ్యూక్ బంతులపై స్పెషల్ ఫోకస్

టెండుల్కర్.. అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్, టీమిండియా మధ్య ఇప్పటి వరకు మూడు టెస్టులు జరిగాయి. ఈ మ్యాచ్‌ల్లో డ్యూక్ బంతుల క్వాలిటీపై రెండు టీమ్స్ ప్లేయర్లు, మాజీలు సందేహాలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో మూడు మ్యాచుల్లోనూ ఉపయోగించిన డ్యూక్ బంతులను క్వాలిటీ చెక్ చేస్తామని తయారీదారులు తెలిపారు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టు మ్యాచ్ సందర్భంగా టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డ్యూక్ బంతుల క్వాలిటీ విషయంలో తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ఈ బంతులు చాలా త్వరగా గట్టిదనాన్ని కోల్పోతున్నాయని కామెంట్ చేశారు. ఇది బ్యాటర్లకు అనుకూలంగా మారుతోందని విమర్శించాడు. బంతి త్వరగా ఆకారం మారిపోతే బౌలర్లకు చాలా కష్టం అవుతుంది. పిచ్ కంటే కూడా వేగంగా బంతి షేప్ ఔట్ అయితే బౌలర్లకు వికెట్లు తీయడం ఇబ్బందికరం. బంతి మెత్తబడితే పేసర్లకు ఎలాంటి సహకారం లభించదు. ఎందుకు ఇలా మారుతున్నాయో అర్థం కావడం లేదు అని శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా డ్యూక్ బంతుల మీద దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. మేం ఎప్పుడైనా విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ బంతుల విషయంలో సమస్య వచ్చేది. సాఫ్ట్‌గా తయారై ఆకారం మారిపోవడం చూసేవాళ్లం. ఇప్పుడు డ్యూక్స్ విషయంలో ఇలా అవడం సరిగ్గా అనిపించడం లేదు. దీనిపై ఏదో ఒక పరిష్కారం కనుక్కోవాల్సిందే అని బెన్ స్టోక్స్ అన్నాడు. డ్యూక్ బంతుల్లో క్వాలిటీ చెక్ విషయంలో తగ్గుతున్నాయని ఇంగ్లాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టువార్ట్ బ్రాడ్ కూడా అభిప్రాయం వ్యక్తం చేశాడు. తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరాడు. మొదట డ్యూక్ బంతుల తయారీ సంస్థ క్రికెటర్ల వాదనలతో విభేదించి.. కాస్త భిన్నంగా స్పందించింది. ఎప్పుడైనా సరే బంతి చెడిపోవాలి. ఇదేమీ రాయి కాదు. ఇలాంటి సమయంలో మ్యాచ్ అధికారులు కొత్త నిబంధనలు తీసుకొస్తే బాగుంటుందేమో ఆలోచన చేయాలి. రెండో కొత్త బంతిని 60 నుంచి 70 ఓవర్ల మధ్యే ఇచ్చేలా రూల్స్ మార్చుకోవచ్చు అని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ యజమాని దిలీప్ జగ్‌జోడియా అన్నాడు. మేం ఆ మూడు మ్యాచుల్లో ఉపయోగించిన బంతులను పరిశీలిస్తాం. దానిపై మా తయారీ నిపుణులతో రివ్యూ చేస్తాం. బంతుల తయారీకి వాడే ముడిసరుకులపై కూడా రివ్యూ నిర్వహిస్తాం. ఆపై ఏమైనా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని భావిస్తే.. మేం ఆ దిశగా చర్యలు తీసుకుంటాం అని జగ్‌జోడియా అన్నారు. టెస్టు క్రికెట్‌లో బంతిని ఎంచుకునే అవకాశం ఆతిథ్య దేశానికి ఉంటుంది. మరి ఈ బాల్స్ క్వాలిటీ చెక్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

# కూలీపై వెయ్యి కోట్ల అంచనాలు




కోలీవుడ్ సినిమాలు ఎన్నో ఏళ్లుగా సౌత్ లో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నప్పటికీ హిందీ ఇండస్ట్రీలో సాలిడ్ కలెక్షన్లు రాబట్టడంలో ఫెయిల్ అవుతున్నాయి. దీనికి అనేక సమస్యలు ఉన్నాయని బాలీవడ్ ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సరైన డబ్బింగ్ ఉండకపోవడం, అట్రాక్టివ్ ప్రమోషన్స్ చేయకపోవడం, 8 వారాల ఓటీటీ అగ్రిమెంట్ కు అంగీకరించకపోవడం లాంటివి మెయిన్ రీజన్స్. దీంతో నేషనల్ లెవెల్ లో మల్టీప్లెక్స్ చైన్ లలో సినిమాలు ఆడడం లేదు. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ ఇప్పుడు కూలీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సన్ పిక్చర్స్ ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఆగస్టు 14న ఈ సినిమా రిలీజ్ కానుంది. దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. కూలీ వరల్డ్ వైడ్ గా రూ.1000 కోట్లు వసూల్ చేస్తుందని అంచనాలు ఉన్నాయి. కానీ, అది నెరవేరాలంటే మాత్రం హిందీలో మంచి వసూళ్లు సాధించడం చాలా అవసరం. అందుకే పాత పద్ధతులకు గుడ్ బై చెప్పి, సన్ పిక్టర్స్ తమ కొత్త సినిమా కూలీ హిందీ రిలీజ్ విషయంలో పక్కాగా ముందుకెళ్తున్నారు. ఈ సినిమాను ప్రముఖ సంస్థ జయంతిలాల్ గడా పెన్ మరుధర్ బ్యానర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. గతంలో ఆర్ఆర్ఆర్, పొన్నియన్ సెల్వన్1, విక్రమ్, సీతా రామం వంటి సౌత్ సూపర్ హిట్ సినిమాలు హిందీలో రిలీజ్ చేసింది. 2.0 తర్వాత రజినీకాంత్ కు కూలీ హిందీలో భారీ స్థాయిలో రిలీజ్ కానుంది. అయితే అదే రోజు, వార్ 2 రిలీజ్ కూడా ఉండడంతో హిందీలో టఫ్ కాంపిటీషన్ ఉండడం పక్కా. ఇది అతిపెద్ద బాక్సాఫీస్ ఫైట్ కానుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కూలీ కంటెంట్ బలంగా ఉంటే కూలీ హిందీలోనూ రాణించే అవకాశం ఉంది. అమీర్ ఖాన్ ఉండడం నార్త్ లో కలిసొచ్చే టాపిక్. గతంలో భారీ వసూళ్లు సాధించిన సౌత్ ఇండియా భారీ సినిమాలు బాహుబలి 2, కేజీఎఫ్: చాప్టర్ 2, పుష్ప 2, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 AD బాలీవుడ్ ఇండస్ట్రీలో సక్సెస్ వల్లే రూ.1000 కోట్ల మార్క్ దాటాయి. ముఖ్యంగా కేజీఎఫ్ 2, పుష్ప ఓవరాల్ వసూళ్లలో 50% కంటే ఎక్కువ నార్త్ నుంచి వచ్చిందే. జైలర్ తో మంచి విజయం సాధించడం, లోకేష్ కనగరాజ్ చివరి సినిమా లియో మల్టీప్లెక్స్ సపోర్ట్ లేకున్నా రూ. 25 కోట్లు సాధించడం కూలీకి కలిసొచ్చే అంశాలు. మౌత్ టాక్ బాగుంటే హిందీలో కూలీ ఈజీగా రూ.100 కోట్లు వసూల్ చేయవచ్చని కూడా తెలుస్తుంది. కాబట్టి మొదటిసారి ఒక తమిళ సినిమా 1000 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉంది. మరి హిందీ రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలంటే ఆగస్ట్ 14 వరకు వెయిట్ చేయాల్సిందే. ఇక రజనీకాంత్ యాక్టింగ్ మీద, లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ మీద ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ అయిన సంగతి తెలిసిందే.



# వీరమల్లు టికెట్ ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో ఎంతంటే?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ మూవీ హరిహర వీరమల్లుకు సంబంధించి ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్‌గా మారింది టికెట్ ధరల టాపిక్. ఎప్పట్నుండో వాయిదాలు పడుతూ వచ్చిన ఈ సినిమా చివరకు జూలై 24న రిలీజ్ కు రెడీ అవుతుంది. మెగా అభిమానులే కాదు.. సాధారణ ప్రేక్షకుల్లో కూడా ఈ సినిమా గురించి మంచి ఆసక్తి నెలకొంది. భారీ స్కేల్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాని గ్రాండ్ గా రిలీజ్ చేయడానికి మేకర్స్ రెడీ అవుతున్నారు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ రావాలంటే టికెట్ ధరలు మెయిన్ అవుతాయనడంలో ఎలాంటి డౌట్ లేదు. గతంలో పెద్ద సినిమాలకు ప్రభుత్వం టికెట్ ధరలు పెంచడానికి అనుమతించింది. ఇప్పుడు అదే రూట్ లో హరిహర వీరమల్లు నిర్మాతలు కూడా స్పెషల్ రేట్ల కోసం ప్రభుత్వ అప్రూవల్ కోసం వెయిట్ చేస్తున్నారు. ముందస్తు సమాచారం ప్రకారం ఏపీలో ఈ సినిమా టికెట్ ధరలు భారీగా ఉండనున్నాయి. ఏపీ సింగిల్ స్క్రీన్స్ లో టికెట్ ధర రూ. 236గా ఉండే అవకాశం ఉంది. మల్టీప్లెక్సుల్లో అయితే ఇది రూ.295 వరకు వెళ్లనుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ పెర్మిషన్ ఇచ్చిన తర్వాతే ఫిక్స్ అవుతుంది. ఇక తెలంగాణలో అయితే టికెట్ల ధరలు మరింత ఎక్కువగా ఉండనున్నాయనే టాక్ నడుస్తుంది. అక్కడ సింగిల్ స్క్రీన్ టికెట్ ధర రూ.265.50గా, మల్టీప్లెక్స్ ధర రూ.413గా ఉండే అవకాశం ఉంది. ఈ మొత్తాలు ఖచ్చితంగా రావాలంటే సంబంధిత ప్రభుత్వల జీవో రావాలి. ఇప్పటి వరకు మేకర్స్ నేరుగా ఈ విషయంపై అఫిషియల్ అనౌన్స్ మెంట్ చేయలేదు. కానీ ట్రేడ్ వర్గాల నుంచి వస్తున్న టాక్ ప్రకారం ప్రకారం వీటిని ఫైనల్ గా భావిస్తున్నారు. సాధారణంగా పవన్ కళ్యాణ్ సినిమాలకు ఫ్యాన్స్ క్రేజ్ ఎక్కువగా ఉండటం వల్ల ప్రీమియం రేట్లకు కూడా డిమాండ్ ఉండటం పక్కా. పీరియాడిక్ యాక్షన్ ఎలిమెంట్స్, పవన్ కళ్యాణ్ లుక్, భారీ విజువల్స్, సంగీతం అన్నింటికీ మంచి హైప్ ఉన్న నేపథ్యంలో టికెట్ రేట్ల పెంపు సహజమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇక టికెట్ ధరల పెంపుతో సినిమా ఓపెనింగ్స్ ఎలా ఉంటాయన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. పవన్ అభిమానులు ఖచ్చితంగా ఎలాంటి రేట్లైనా ఫస్ట్ డేకు భారీగా థియేటర్లకు వెళ్లే అవకాశం ఉంది. ఇక ఫ్యామిలీ ఆడియన్స్ ఎలా రెస్పాండ్ అవుతారు అనేది చూడాలి. ఏదేమైనా ఈ టికెట్ ధరలు సినిమాకు మరింత హైప్ తెచ్చేలా మారాయి. మరి వీటిపై అఫిషియల్ జీవో వచ్చాక ఎలా రెస్పాన్డ్ అవుతారో చూడాలి.







# అప్పుడు ఆదిపురుష్.. ఇప్పుడు రామాయణ?

బాలీవుడ్ సినిమా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక సినిమా రామాయణ. రణబీర్ కపూర్ అలాగే సాయి పల్లవి మెయిన్ లీడ్స్ లో యష్, కాజల్ అగర్వాల్, సన్నీ డియోల్ లాంటి ఇండస్ట్రీ బిగ్ స్టార్ మరో మెయిన్ క్యారెక్టర్ లో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ సినిమా భారీ హంగులతో తెరకెక్కిస్తున్నారు. అయితే దీనికి ముందు బాలీవుడ్ నుంచి వచ్చిన ఆదిపురుష్ సినిమాకి అప్పట్లో మేకర్స్ ఇచ్చిన ఓ స్టేట్మెంట్ ఇప్పుడు రామాయణ విషయంలో వైరల్ గా వినిపిస్తుంది. రామాయణ సినిమాలో వానర సైన్యం కోసం ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ లో కనిపించే తరహా టెక్నాలజీతో చేస్తున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. అయితే సరిగ్గా ఆదిపురుష్ కి కూడా ఇదే మాట అప్పట్లో వినిపించింది. తాము కూడా మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతోనే అవతార్ తరహాలో చేస్తున్నాం అన్నట్టుగా పలు వార్తలు వినిపించాయి. ఒకింత ఇలాంటి గ్రాఫిక్స్ వల్లే ఎక్కువ బడ్జెట్ కూడా అని వినిపించింది. మరి ఇప్పుడు రామాయణకి కూడా అదే తరహా రూమర్ వినిపిస్తుంది. మరి ఇందులో ఏ రేంజ్ ఆఫ్ అవుట్ పుట్ ఉంటుందో చూడాలి. ఆదిపురుష్ లో మాత్రం ఆ వానర సేన ఎపిసోడ్స్ నుంచే విజువల్స్ తేలిపోయాయి. మరి రామాయణకి 4000 కోట్ల బడ్జెట్ అంటున్నారు కాబట్టి మరింత నాచురల్ విజువల్స్ నే ఎక్స్ పెక్ట్ చేయొచ్చు.

# వార్ 2 ట్రైలర్ రన్ టైం ఎంతంటే?

ప్రస్తుతం పాన్ ఇండియా ఆడియెన్స్ ఎంతో ఇంట్రెస్టింగ్ గా వెయిట్ చేస్తున్న సెన్సేషనల్ మల్టీ స్టారర్ మూవీ ఏదన్నా ఉంది అంటే అది మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కాంబోలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన సాలిడ్ యాక్షన్ సినిమా వార్ 2 మాత్రమే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అంతగా ఈ సినిమాపై ఆడియన్స్ ఫోకస్ చేస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో ఈ సినిమా నుండి వచ్చే చిన్న అప్డేట్ అయినా సరే ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. అయితే లేటెస్ట్ గా ఈ ట్రైలర్ పై సాలిడ్ అప్డేట్ ఇపుడు బయటకి వచ్చింది. దీనితో వార్ 2 ట్రైలర్ రన్ టైం సహా ట్రైలర్ ఎప్పుడు విడుదల అనే తేదీలు తెలుస్తున్నాయి. లేటెస్ట్ గా వార్ 2 ట్రైలర్ సెన్సార్ ముంబైలో పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుంది. మేకర్స్ 2 నిమిషాల 39 సెకండ్ల డ్యూరేషన్ ఉన్న వార్ 2 ట్రైలర్ కట్ ని లాక్ చేశారట. ట్రైలర్ రిలీజ్ పై టాక్ మొదలు కావడంతోనే బాలీవుడ్ వర్గాలు రానున్న వారంలో రిలీజ్ చేస్తారని కన్ఫర్మ్ చేశారు. అయితే లేటెస్ట్ స్ట్రాంగ్ బజ్ ప్రకారం ఈ అవైటెడ్ వార్ 2 ట్రైలర్ ని మేకర్స్ జూలై 23న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తారని తెలుస్తుంది. యష్ రాజ్ ఫిల్మ్స్ తాలూకా స్పై యూనివర్స్ నుంచి వస్తున్న ఈ పర్టిక్యులర్ సినిమాపై మాత్రం అంచనాలు పతాక స్థాయిలో ఉన్నాయి. పైగా ఎన్టీఆర్, హృతిక్ లు కలయిక కాబట్టి ట్రైలర్ పై మరిన్ని అంచనాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ యాక్షన్ అండ్ పర్ఫార్మెన్స్ ను ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఆడియన్స్ తెగ వెయిట్ చేస్తున్నారు.



# AA22×A6: వర్క్ స్టార్ట్ చేసిన అట్లీ!




పాన్ ఇండియా లెవెల్ లో ఎక్కడికక్కడ హైప్ క్రియేట్ చేస్తున్న ఓ ప్రాజెక్ట్ అంటే అది అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్లో తెరకెక్కనున్న AA22XA6 మూవీ. జవాన్ తో సూపర్ సక్సెస్ తర్వాత అట్లీ ఫోకస్ కంప్లీట్ గా ఈ సినిమాపైనే ఉంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ జోరుగా జరుగుతోంది. బన్నీ అట్లీ కాంబో నుంచి వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ పై ఆడియన్స్ లో భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమా స్టైల్, కంటెంట్, మేకింగ్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఇంట్రెస్ట్ గా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా గురించి వస్తున్న అప్డేట్స్ లో లేటెస్ట్ హైలైట్ సాయి అభ్యంకర్ హైలెట్ అవుతున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీ లో యంగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ లో అతడే టాప్ టాక్. వయసు కేవలం 20 ఏళ్లు మాత్రమే అయినా ఇప్పటి వరకూ ఏ సినిమా కూడా రిలీజ్ కాకముందే ఎనిమిది ప్రాజెక్ట్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. అలాంటి కుర్రవాడిని అట్లీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ AA22కి సెలెక్ట్ చేయడం సినిమాకి ఓ స్పెషల్ టచ్ కలిపినట్లైంది. ఇది టాలెంట్ ను ఎలా గుర్తించాలో అట్లీకి తెలిసినట్టు మరోసారి ప్రూవ్ అయ్యింది. లేటెస్ట్ గా అట్లీ, సాయి అభ్యంకర్ మధ్య ఓ మ్యూజిక్ సెషన్ వీడియో కాల్ లో జరిగిందని తెలుస్తోంది. ఆన్ లైన్ జ్యామ్స్ అంటూ సాయి అభ్యంకర్ తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేసిన స్క్రీన్‌షాట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అట్లీ కూడా ఈ పోస్టును రీషేర్ చేస్తూ ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని సిగ్నల్స్ ఇస్తున్నాడు. దీనివల్ల ఇప్పుడే మ్యూజిక్ పనుల స్టేజ్ లోకి వెళ్తున్న AA22 ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగిపోయాయి. ఈ వీడియో కాల్‌ను చూసి అట్లీ సాయి అభ్యంకర్ కాంబో నుంచి డిఫరెంట్ ట్యూన్స్ వస్తాయనే ఫీలింగ్ జనాల్లో క్రియేట్ అయ్యింది. సాయి అభ్యంకర్ ఇప్పటికే సూర్య, కార్తీ, శివకార్తికేయన్, శింబు, లారెన్స్, షేన్ నిగమ్‌లతో ప్రాజెక్ట్స్ చేస్తున్న విషయం తెలిసిందే. కానీ అల్లు అర్జున్ తో AA22 ప్రాజెక్ట్ అతడి కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా మారే అవకాశం ఉంది. ఈ సినిమాలో మ్యూజిక్ భారీగా ఉండబోతుందని ట్రేడ్ వర్గాల అంచనా. మాస్, క్లాస్ రెండు టోన్లను మిక్స్ చేస్తూ సాయి అందించే సంగీతం సినిమా విజువల్స్ కు సపోర్ట్ గా నిలవనుందని తెలుస్తోంది. పాన్ ఇండియా ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా ఈ ఆల్బమ్ ఉంటుందని టీమ్ భావిస్తోంది. ఇక సినిమా విషయానికొస్తే, AA22 హై బడ్జెట్‌తో తెరకెక్కనున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోంది. బన్నీని ఎప్పుడూ చూడలేని పవర్ ఫుల్ రోల్‌లో చూడబోతున్నాం. ప్రస్తుతం అట్లీ స్క్రిప్ట్, సెట్ డిజైన్, మ్యూజిక్ పనులపై దృష్టి పెట్టగా, రెగ్యులర్ షూటింగ్ కి రంగం రెడీ అవుతుంది. ఈ సినిమాతో అట్లీ, బన్నీ ఇద్దరూ కొత్త రికార్డులు సెట్ చేయాలనే లక్ష్యంతో ఉన్నారని తెలుస్తోంది. ఇక మ్యూజిక్ పక్కాగా ఉంటే హైప్ మరింత పెరగడం ఖాయం అనే టాక్ కూడా వినిపిస్తుంది.